# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 173 | విశాఖపట్నం | 25-3-2026 బుధవారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 173 | VISAKHAPATNAM | 25-3-2026 WEDNESDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram




# మాట ఇచ్చాం... మార్పు తెచ్చాం: చంద్రబాబు



**అమరావతి, పతాకం న్యూస్:** "మాట ఇచ్చాం... మార్పు తెచ్చాం. ప్రజలు ఇచ్చిన అధికారంతో ప్రతీ రంగంలో, ప్రతీ ప్రాంతంలో మార్పు తెచ్చి చూపిస్తున్నాం. ఉత్తరాంధ్రలో ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ రాకతో గొప్ప ముందడుగు వేశాం. 21 నెలల క్రితం కబ్జాలు, కూల్చివేతలు, కేసులతో అభద్రత, భయం, మానసిక క్షోభతో అల్లాడిన ఉత్తరాంధ్ర ప్రాంతంలో... నేడు అభివృద్ధి, అవకాశాలు, ఆకాంక్షలతో అన్ని చోట్లా ఆనందాన్ని, భవిష్యత్ పై భరోసాను తీసుకువచ్చాం" అని చంద్ర బాబు నాయుడు సోషల్ మీడియా వేదికగా తెలియజేశారు. ఆంధ్రుల హక్కు అని పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమ మన ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిస్తే... ఇప్పుడు అనకాపల్లి జిల్లాలో ఏర్పాటు అవుతున్న ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా పరిశ్రమ ఉత్తరాంధ్ర భవిష్యత్‌కు నూతన దిక్సూచి అవుతుంది. రూ.1.36 లక్షల కోట్ల పెట్టుబడితో రెండు దశల్లో ఏర్పాటు అవుతున్న ఉక్కు కర్మాగారం ఉత్తరాంధ్రను ఉక్కు ఆంధ్రాగా మారుస్తుంది. ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ నిర్మాణంతో ఉక్కు రంగంలో ఏపీ దేశంలో అత్యున్నత స్థానానికి చేరుకుంటుంది.

ప్రధాని మోడీ, కేంద్ర ప్రభుత్వ సహకారం వల్లనే 21 నెలల్లో ఇంత పెద్ద ప్లాంట్‌ను రాష్ట్రానికి తీసుకురాగలిగాం. ప్లాంట్‌కు అవసరమైన ముడి ఖనిజం సరఫరా నుంచి అనుమతుల వరకు కేంద్రం వేగవంతమైన, సానుకూల నిర్ణయాలతో ప్రతి దశలోనూ ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చింది. డబుల్ ఇంజన్ సర్కారు ప్రగతిశీల నిర్ణయాల వల్లనే ఈ ప్రాంతంలో ఒక స్టీల్ సిటీ నిర్మితమవు తోంది. యువతకు లక్షల సంఖ్యలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు వస్తాయి. వచ్చే మూడేళ్లలోనే ఈ ప్రాంతంలో అన్ని రంగాల్లో, అన్ని విధాలా అభివృద్ధి ఫలాలు అందుతాయి. భారతదేశంలోనే అతి పెద్ద స్టీల్ ప్లాంట్‌కు అడుగులు పడిన సందర్భంగా ఉత్తరాంధ్ర ప్రజలకు శుభాకాంక్షలు" అంటూ సీఎం చంద్రబాబు తన పోస్టులో పేర్కొన్నారు.

# చంద్రబాబుపై రోజా ఫైర్




**నగరి, పతాకం న్యూస్:** ముఖ్యమంత్రి చంద్రబాబు పంచాంగ శ్రవణం సాక్షిగా ప్రజలకు అబద్ధాలు చెప్పారని మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు ఆర్కే రోజా మండిపడ్డారు. ప్రజలు సంతోషంగా ఉన్నారన్న సీఎం చంద్రబాబు వ్యాఖ్యలపై ఆమె ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కిందని దుయ్యబట్టారు. 18 ఏళ్లు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ. 1,500 ఇస్తామన్న హామీ ఏమైంది? అది కేవలం ఓట్ల కోసమేనా? అని ఆమె ప్రశ్నించారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని (తరువాయి 2వ పేజీలో)

### ఏపీకి మిట్టల్ స్టీల్‌ప్లాంట్ రావడానికి

# జగనే కారణం: అమర్‌నాథ్



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లాలో నక్కపల్లికి అర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ రావడానికి అసలు కారణం వైసీపీ అధినేత జగన్ అని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. దావోస్ పర్యటనలో ఆదిత్య మిట్టల్‌తో జగన్ జరిపిన చర్చల ఫలితంగానే ఈ భారీ ప్రాజెక్టు పట్టాలెక్కిందని గుర్తుచేశారు. ఆదిత్య మిట్టల్ కోరిన విధంగానే నక్కపల్లి వద్ద 4 వేల ఎకరాల భూమిని చూపించామని, ఎన్నికల నోటిఫికేషన్ సమయంలోనే దీనిపై స్పష్టత వచ్చిందని ఆయన వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రానికి కొత్తగా వచ్చిన పరిశ్రమలపై శ్వేతపత్రం విడుదల చేయాలని అమర్‌నాథ్ డిమాండ్ చేశారు. జగన్ హయాంలో వచ్చిన బల్క్ డ్రగ్ పార్క్ నిర్మాణం ఇప్పటికీ పూర్తి చేయలేకపోవడంపై ఆయన విమర్శలు గుప్పించారు. 35 వేల మందికి ఉపాధి కల్పించాల్సిన ఈ ప్రాజెక్టు ప్రస్తుతం అయోమయంలో పడిందని, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడటంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. గడిచిన కాలంలో సుమారు రూ. 6,500 కోట్ల పెట్టుబడులు రాష్ట్రాన్ని వదిలి వెళ్లిపోయాయని ఆయన ఆరోపించారు. ఇదే క్రమంలో వైఎస్ షర్మిల చేస్తున్న ఆరోపణలపై అమర్‌నాథ్ తీవ్రంగా స్పందించారు. "మీ రాజకీయ అవసరాల కోసం జగన్ వ్యక్తిత్వాన్ని కించపరచకండి. ఎవరి చేతిలోనూ రాజకీయ పావుగా మారకండి" అని హితవు పలికారు



3లో

## నంద్యాలలో ఫుడ్ పాయిజన్..
## 60 మందికి అస్వస్థత

## తరచూ నెలసరి నొప్పులు వస్తున్నాయా..?



6లో



5లో

## జోరుగా ఇసుక అక్రమ తవ్వకాలు!

### పారిశ్రామిక రంగంలో మిట్టల్ స్టీల్ ప్లాంట్‌ది

# చారిత్రాత్మక ఘట్టం: రామ్మోహన్‌నాయుడు



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** అనకాపల్లిలో మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు ఏపీ పారిశ్రామిక రంగంలో చారిత్రాత్మక ఘట్టమని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వ్యాఖ్యానించారు. అనకాపల్లిలో మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర తలరాతను మార్చనున్న మెగా స్టీల్ ప్లాంట్ ప్రాజెక్ట్ ఇదని పేర్కొన్నారు. దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ స్టీల్ ప్లాంట్‌గా ఏపీ ప్రాజెక్ట్ రికార్డు సృష్టించనుందని (తరువాయి 2వ పేజీలో)

## జాబ్ క్యాలెండర్‌పై షర్మిల విమర్శలు

2లో



### మచిలీపట్నంలోని రవాణా శాఖ కార్యాలయంపై

# ఏసీబీ దాడులు




**మచిలిలీపట్నం, పతాకం న్యూస్:** కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని రవాణా శాఖ కార్యాలయంపై ఎసిబి అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచే కార్యాలయాన్ని చుట్టుముట్టిన ఎసిబి బృందాలు లోపల సోదాలు చేపట్టాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం .... అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఈ రైడ్స్ జరిగినట్లు తెలుస్తోంది. డ్రైవింగ్ లైసెన్సులు, వాహన రిజిస్ట్రేషన్లు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లలో అక్రమాలు జరిగాయని ఫిర్యాదులు అందినట్లు సమాచారం. అధికారులు రికార్డులు, కంప్యూటర్లు, కీలక పత్రాలను పరిశీలిస్తున్నారు. కొన్ని చోట్ల నగదు లావాదేవీలపై కూడా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ దాడులతో రవాణా శాఖలో ఒక్కసారిగా కలకలం రేగింది. పూర్తి వివరాలు ఇంకా వెలుగులోకి రావాల్సి ఉంది.


పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా.. అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా.. పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## అమానవీయం!

పేదవాళ్ల చదువుల మీద, తినే అన్నం మీద విషం చిమ్మడం. గరికపాటి నరసింహారావు అనే ప్రవచనకర్త, కనీస స్పృహ, విచక్షణ లేకుండా తూలిన ఆ మాటల్లో రెండు ప్రధానమైన విషయాలు ఉన్నాయి. ఒకటి: 'ప్రభుత్వం పుస్తకాలు ఇవ్వడం ఏంటి? యూనిఫామ్‌లు ఇవ్వడం ఏంటి? అన్నం పెట్టడం ఏంటి? చదువు చెప్పాలి కానీ... చదువుకుంటే చదువుకోమనండి, లేకపోతే మానేయమ నండి.' రెండవది: 'ఇన్ని సౌకర్యాలు ఇస్తే, మళ్ళీ అందులో బల్లి పడింది, పిల్లి పడింది అని అంటారు..పడవా మరి?' ఈ మాటల్లో సామాజిక అవగాహన, స్పృహ లేవు సరికదా... కనీస మానవత్వం, సహానుభూతి అంతకన్నా లేవు. ఇది మనసులో గూడుకట్టుకుపోయి ఉన్న పేదరికం పట్ల వ్యతిరేక భావజాలానికి నిదర్శనం. ఆకలిని అవమానించడం, బల్లి, పిల్లి పడితే పడనివ్వండి అనడంలో ఆ పసిపిల్లలు బతికితే ఏంటి? లేకపోతే పోతే ఏంటి? అనే చులకనభావం, కర్కశత్వం. ఆకలి రుచి తెలిస్తే మధ్యాహ్న భోజన పథకంలోని ఔన్నత్యం అర్థమవుతుంది. వడ్డించిన విస్తరి జీవితాలు గడిపేవారికి ఇది ఎప్పటికీ అర్థం కాదు. ఈ దేశంలో కోట్లాది కుటుంబాలు దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తున్నాయి. అంటే కూడు, గూడు, గుడ్డ అనే కనీస అవసరాలు కూడా తీర్చుకోలేని స్థితిలో ఉన్నారు. ఈ దేశంలో 30 కోట్ల మంది దారిద్ర్య రేఖకు దిగువన జీవించేవారు ఉన్నారు. వీరి కుటుంబాలలో సరైన తిండి లేక, పౌష్టికాహార లోపంతో ఏటా రెండున్నర లక్షల మంది పిల్లలు చనిపోతున్నారు. పేదరికం కారణంగా తల్లిదండ్రులు పిల్లలను బడికి పంపక, తమతో పాటు కూలిపనులకు తీసుకుపోతున్నారు. యునిసెఫ్, ఎన్.ఎఫ్.హెచ్.ఎస్ నివేదికల ప్రకారం, భారత్ లోని పిల్లలలో 35 శాతం పైగా వయసుకు తగ్గ పొడవు లేరు. 19 శాతం తీవ్ర పోషకాహార లోపంతో వున్నారు. పదవ తరగతి పూర్తయ్యేలోపు పేదవాళ్ల పిల్లలు 12 నుండి 17 శాతం వరకు డ్రాపవుట్ అవుతున్నారు. అయితే మధ్యాహ్న భోజన పథకం వలన డ్రాపవుట్లు తగ్గడమే కాకుండా, హాజరు పది శాతం వరకు పెరిగిందని గణాంకాలు చెబుతున్నాయి. పిల్లలు బడికి క్రమం తప్పకుండా హాజరవుతున్నారు. పిల్లల ఆకలి అవసరాలు తీరడమే కాకుండా, పౌష్టికాహార లోపం వలన చనిపోయే పిల్లల శాతం తగ్గింది. తల్లిదండ్రులకు భారం తగ్గి వారి జీవన ప్రమాణాలు కొంత మెరుగవడానికి ఇది దోహదపడుతుంది. ఈ మధ్యాహ్న భోజన పథకం రూపొందించడంలో, అమలు చేయడంలో ఉన్నతమైన ఉద్దేశం, ఇటువంటి విస్తృత ప్రయోజనాలు ఇమిడి ఉన్నాయి. ఆకలితో ఉన్న పిల్లవానికి చదువు చెప్పడం కాదు, ముందు అతని ఆకలి తీర్చాలి. అప్పుడే చదువును ఆకళింపు చేసుకోగలుగుతాడు. శారీ రకంగానే కాకుండా మానసికంగా కూడా ఆరోగ్యవంతమైన తరం తయారు కాగలుగుతుంది. అందరికీ ప్రాథమిక విద్యనందించాలని రాజ్యాంగ సవరణ చేసి, 14 సంవత్సరాల లోపు పిల్లల చదువును 'ప్రాథమిక హక్కు'గా మార్చడంలో ప్రధానమైన ఉద్దేశం ఇదే. ఇన్ని సౌకర్యాలు కల్పిస్తూ పుస్తకాలు, యూనిఫాం, భోజనం పెడితే '...పెళ్లికొడుకుల్లా తయారవుతారు కానీ చదవరు' అనే వెకిలి మాటలు పేదల పట్ల చులకన భావానికి పరాకాష్ట. ఈ ప్రభుత్వ పాఠశాలల్లో, హాస్టళ్లలో చదివిన పేద పిల్లలు డాక్టర్లు, ఇంజినీర్లు, ప్రొఫెసర్లు, న్యాయమూర్తులు, శాస్త్రవేత్తలు, ఐ.ఏ.ఎస్, ఐ.పి.ఎస్ అధికారులుగా తయార య్యారు, అవుతున్నారు. దీనికి వందలాది ఉదాహరణలు ఈ దేశంలో, ఈ రాష్ట్రంలో ఉన్నాయి. నేను ఒక సామాన్యమైన వాడిని. గ్రామీణ ప్రాంతం, పేదరికం నుండి వచ్చిన వాడిని. ప్రభుత్వం ఇచ్చిన మధ్యాహ్న భోజనం, యూనిఫాం సౌకర్యాలు ఉపయోగించుకుని, 10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న వాడిని. ఈ రోజు నేను ఒక ఐ.పి.ఎస్ ఆఫీసర్ అయ్యాను. నాలాంటివారు ఎన్నో వందల మంది ఈ సదుపాయాలు ఉపయో గించుకుని ఈరోజు ఉన్నత స్థానాల్లో ఉన్నారు. దీనివలన సమాజంలో ఆర్థిక సామాజిక అసమానతలు తగ్గించడానికి అవకాశం ఉంటుంది. కానీ, గరికపాటి వంటి వారి మాటలను సమర్థించే ఉన్మాద మానసిక స్థితిగల వ్యక్తులు పేదరికాన్ని వెక్కిరిస్తున్నారు. పేదవాడు పేదవాడిగానే మరణించాలి అనే క్రూరమైన ఆలోచనా విధానం వీరిలో కనపడుతుంది. మధ్యాహ్న భోజనం వంటి పథకాలను కేవలం ఖర్చుగా చూడకూడదు. ఇది భవిష్యత్తు మీద ప్రభుత్వం చేస్తున్న పెట్టుబడి (ఇన్వెస్ట్‌మెంట్)గా చూడాలి. ఇది అక్షర సత్యం. దీనివలన శక్తివంతమైన మానవవనరులను తయారుచేయ గలుగుతాం. సమాజంలో అన్ని వర్గాలకు సమానమైన అవకాశాలు దక్కినప్పుడు, కులమతాలకు అతీతంగా ప్రతి పేదకుటుంబం ఎదిగినప్పుడు శక్తివంతమైన భారతదేశం తయారవుతుంది. ఇప్పటికే విద్యారంగంలో తీవ్రమైన అసమానతలు ఉన్నాయి. ధనవంతులకు ఇంటర్నేషనల్, కార్పొరేట్ స్కూళ్ల ద్వారా ఆధునిక, నాణ్యమైన విద్య అందుబాటులో ఉంది. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాలలోని పేద పిల్లలు వారితో పోటీ పడగలగాలి. అందుకు ఇటువంటి కనీస సౌకర్యాలు చాలా అవసరం. పేదవాడి విద్యపై చేసే ఇటువంటి అహంకారపూరిత వ్యాఖ్యానాలను కేవలం వ్యక్తిగతంగా చూడకూడదు. అభ్యుదయ వాదులు, మానవతావాదులు వీటిని ఖండించాలి. లేకపోతే అబద్ధమే నిజమని నమ్మే ప్రమాదం ఉంది. ఒక నిజాన్ని బతికించాలంటే, దానికి సంబంధించిన అబద్ధాన్ని అంతం చేయాలి. సత్యమేవ జయతే.

## తప్పుడు కేసులు పెరిగిపోతున్నాయి... కేంద్ర, రాష్ట్రాలకు సుప్రీంకోర్టు నోటీసులు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** దేశవ్యాప్తంగా క్రిమినల్ న్యాయ వ్యవస్థలో పెరుగుతున్న తప్పుడు ఫిర్యాదులు, కల్పిత ఆరోపణలు, నకిలీ సాక్ష్యాల సమస్యపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై సుప్రీంకోర్టు మంగళవారం విచారణ చేపట్టింది. ఈ అంశంపై స్పందన తెలియజేయాలంటూ కేంద్ర ప్రభుత్వం, అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్ మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం.. న్యాయవాది అశ్విని కుమార్ ఉపాధ్యాయ్ దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై విచారణ జరిపి ఈ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ కేసులో తదుపరి విచారణ మే 11న జరిగే అవకాశం ఉంది. భారతీయ నాగరిక సురక్షా సంహిత (బీఎన్‌ఎస్‌ఎస్), 2023లోని సెక్షన్లు 215, 379లను ఉన్నది ఉన్నట్లుగా అన్వయించడం వల్ల పలు శిక్షాస్మృతి నిబంధనలు నీరుగారిపోతున్నాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనివల్ల కొందరు వ్యక్తులు పోలీస్ స్టేషన్లను తప్పుడు ఎఫ్ఐఆర్‌లతో, కోర్టులను తప్పుడు కేసులతో ముంచెత్తుతున్నారని ఆరోపించారు. ప్రస్తుత చట్టాల ప్రకారం తప్పుడు కేసుల బాధితులు నేరుగా న్యాయపోరాటం చేసేందుకు కోర్టు నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరి కావడం, జవాబుదారీతనానికి ఇది అడ్డంకిగా మారిందని పిటిషనర్ వాదించారు. తప్పుడు కేసుల బెదిరింపుల వల్ల అమాయకులు తీవ్రంగా నష్టపోతున్నారని, కొందరు ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారని పిటిషన్‌లో ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని ఫతేపూర్ జిల్లాలో ఒక కుటుంబం తప్పుడు కేసుల బెదిరింపులతో ఆత్మహత్య చేసుకున్న ఘటనను ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో, తప్పుడు కేసుల బాధితులు నేరుగా కోర్టు అనుమతితో ఫిర్యాదు చేసేలా బీఎన్‌ఎస్‌ఎస్ చట్టంలోని నిబంధనలకు సరైన భాష్యం చెప్పాలని పిటిషనర్ కోరారు. చట్టాన్ని దుర్వినియోగం చేయకుండా అడ్డుకోవాలని, అమాయక పౌరులను కాపాడేందుకు సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## పోలీసుల తీరుపై అంబటి ధ్వజం..



**గుంటూరు, పతాకం న్యూస్:** తన నివాసం, కార్యాలయంపై జరిగిన దాడి ఘటనలో పోలీసుల వ్యవహారశైలిని నిరసిస్తూ మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు సంచలన నిర్ణయం తీసుకున్నారు. జనవరి 31న సుమారు 7 గంటల పాటు తన ఆస్తులపై విధ్వంసం సృష్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పోలీసు యంత్రాంగంపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.తన ఇంటిపై దాడి చేసిన వారికి కేవలం ఏడేళ్ల లోపు శిక్ష పడే సెక్షన్లతో స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపారని, కానీ అదే సెక్షన్లతో తనను మాత్రం 18 రోజుల పాటు జైలుకు పంపడం అన్యాయమని అంబటి మండిపడ్డారు. నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో తనపై కస్టోడియల్ టార్చర్ జరిగిందని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఆ స్టేషన్ లోని సీసీటీవీ ఫుటేజీని తక్షణమే స్వాధీనం చేసుకోవాలని కోరారు. టీడీపీ నేతలు దాడి చేస్తున్నప్పుడు పోలీసులు వారికి పూర్తిగా సహకరించారని, తాను ఫిర్యాదు చేసే వరకు కనీసం సుమోటోగా కూడా కేసు నమోదు చేయలేదని ఆరోపించారు. ముఖ్యంగా పట్టాభిపురం సీఐ వెంకటేశ్వర్లు ఈ కేసులో దారుణంగా వ్యవహరించారని అన్నారు. ఈ దాడుల వెనుక ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ హస్తం ఉందని నేరుగా ఆరోపించారు. ఈ కేసులో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని అంబటి స్పష్టం చేశారు. ఈ ఘటనపై విచారణకు సిట్ ఏర్పాటు చేయాలని, హత్యాయత్నం, ఆస్తి నష్టం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశామని, అక్కడ న్యాయం జరగకపోతే దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు మెట్లు ఎక్కేందుకైనా సిద్ధమని హెచ్చరించారు.

## జాబ్ క్యాలెండర్‌పై షర్మిల విమర్శలు



**అమరావతి, పతాకం న్యూస్:** ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కొండంత రాగం తీసి కూసింత పాట పాడినట్లుగా ఈ క్యాలెండర్ ఉందని, ఇది యువతను మోసం చేయడమేనని ఆమె ఆరోపించారు. జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను నిరాశపరిచారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1.80 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉంటే, కేవలం 10 వేల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వడం యువతకు అన్యాయం చేయడమేనని షర్మిల పేర్కొన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన క్యాలెండర్ చూసి అంతా తుస్సుమనిపించిందని వ్యాఖ్యానించారు.

ఈ నేపథ్యంలో, రాష్ట్రంలోని ఉద్యోగాల భర్తీపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెంటనే ఒక శ్వేతపత్రం విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు. వాస్తవ ఖాళీలు ఎన్ని, వాటిని ఎప్పటిలోగా భర్తీ చేస్తారో స్పష్టత ఇవ్వాలని కోరారు. దీంతోపాటు, గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల వయోపరిమితిని 47 ఏళ్లకు పెంచాలని కూడా ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

## ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను జీవీఎంసీ స్వాధీనం చేసుకోనుందా?



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** బీచ్‌రోడ్డులోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను స్వాధీనం చేసుకోవాలని జీవీఎంసీ అధికారులు యోచిస్తున్నారు. మూడేళ్ల కిందటి వరకు ఈ కాంప్లెక్స్ జీవీఎంసీ ఆధీనంలోనే ఉండేది. అందులోని మూడు స్విమ్మింగ్‌పూల్స్‌లో శిక్షణ పొంది పలువురు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయసాజయి పోటీల్లో సత్తాచాటారు. మరికొందరు వ్యాయామంలో స్విమ్మింగ్ సాధన చేసేవారు. అయితే మరమ్మతులకు గురవడంతో కరోనా సమయంలో పూర్తిగా మూసివేశారు. ఆ తరువాత రూ.ఐదు కోట్లకు పైగా వెచ్చించి ఆధునికీకరించారు. అనంతరం నిర్వహణను అప్పటి కమిషనర్ ప్రైవేటు ఏజెన్సీకి మూడేళ్లు లీజుకు ఇచ్చేశారు. ఆ ఏజెన్సీ ఒప్పందం ప్రకారం సిబ్బందిని నియమించకపోవడంతోపాటు అధిక ఫీజులు వసూలు చేస్తుండడంతో నగరవాసుల నుంచి తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి. కాంప్లెక్స్ లీజు గడువు వచ్చే జూన్‌తో ముగియనుంది. ఇదిలావుండగా స్వర్ణభారతి స్టేడియం నిర్వహణను ప్రైవేటుకు అప్పగించాలని ఒత్తిడి వచ్చినప్పటికీ కమిషనర్ కేతన్‌గార్గ్ నగరవాసుల అభిప్రాయానికి అనుగుణంగా జీవీఎంసీ ఆధ్వర్యంలోనే నిర్వహిస్తామని ప్రకటించారు. దీనివల్ల నెలరోజుల్లోనే సుమారు రూ.30 లక్షల ఆదాయం సమకూరింది. ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను కూడా జీవీఎంసీయే నిర్వహిస్తే అందరికీ అందుబాటులో ఉండడంతో పాటు జీవీఎంసీకి అధిక ఆదాయం సమకూరుతుందని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో లీజు గడువు పొడిగించకుండా, స్వాధీనం చేసుకుని నిర్వహించేలా జీవీఎంసీ ప్రత్యేక అధికారి, కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్‌కు ప్రతిపాదన పంపినట్టు తెలిసింది.

## ప్రజల సమస్యల పరిష్కరిస్తాం: సుభాష్



**రామచంద్రపురం, పతాకం న్యూస్:** రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కు 168 అర్జీలు వచ్చాయి. నియోజకవర్గం లోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను నేరుగా మంత్రికి తెలియజేశారు. ఇళ్ల స్థలాలు, వృద్ధాప్య పింఛన్లు, వికలాంగ పింఛన్లు, కొత్త రేషన్ కార్డులు కోరుతూ అర్జీలు వచ్చాయి. ప్రతి వినతిపత్రాన్ని శ్రద్ధగా పరిశీలించిన మంత్రి సంబంధిత అధికారులతో మాట్లాడారు. తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల సమస్యలపై ఎటువంటి ఆలస్యం సహించబోమన్నారు. పరిష్కారం దిశగా ముందుకు సాగాలని అధికారులకుసూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండటం తన ప్రాథమిక బాధ్యత అని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతానని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని, ప్రజల అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను దగ్గరగా తెలుసుకోవడం ద్వారా సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని మంత్రి సుభాష్ పేర్కొన్నారు. ప్రజా దర్బార్ కార్యక్రమం ప్రజలకు నమ్మకాన్ని కలిగించే వేదికగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంతరారు, కూటమి పార్టీ నాయకులు, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

(మొదటిపేజీ తరువాయి)

## చంద్రబాబుపై రోజా ఫైర్

గత జగనన్న పాలనలో రైతులు, పేదలు ఎలా సంతోషంగా ఉన్నారో ప్రజలందరికీ తెలుసని ఆమె గుర్తు చేశారు. నెలకు రూ. 3,000 నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి యువతను నట్టేట ముంచారని, రాష్ట్రంలో నిరుద్యోగులు, రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే సమయంలో, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు తీరుపై కూడా రోజా విమర్శలు గుప్పించారు. టీటీడీ ఛైర్మన్ పదవి నాకు అన్నం పెడుతుందా, నాకు హైదరాబాద్‌లో చాలా వ్యాపారాలు ఉన్నాయి అని బీఆర్ నాయుడు అన్నారని ఆమె మండిపడ్డారు. "అర్హత లేని వారికి పదవులు ఇస్తే ఇలానే మాట్లాడుతారు. తిరుమల పవిత్రతను దెబ్బతీసేలా ప్రవర్తిస్తున్న బీఆర్ నాయుడు తక్షణమే రాజీనామా చేయాలి. అలాంటి వ్యక్తులను తరిమి తరిమి కొట్టాలి" అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

## చారిత్రాత్మక ఘట్టం: రామ్మోహన్‌నాయుడు

తెలిపారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. లక్షలాదిమందికి పైగా నిరుద్యోగులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు కల్పించనుందని రామ్మోహన్ నాయుడు వ్యాఖ్యానించారు. ఏటా 17 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉక్కు ఉత్పత్తి లక్ష్యంతో ఈ ప్రాజెక్ట్ ముందుకు సాగనుందని వివరించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో ఈ ప్రాజెక్ట్ కీలక మైలురాయని ఉద్ఘాటించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కృషితో ఈ భారీ ప్రాజెక్ట్ సాకారమైందని చెప్పుకొచ్చారు. రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి ఆర్సెలార్ మిట్టల్ – నిప్పన్ స్టీల్ ఇండియా ప్లాంట్ ఇంజిన్‌గా మారనుందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

# గరికపాటి వాఖ్యలపై నిరసన వ్యక్తం చేసిన ఎస్ఎఫ్ఐ




**కొయ్యూరు, పతాకం న్యూస్:** పేద పిల్లలకు అందించే మధ్యాహ్న భోజన పథకంపై ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు చేసిన అహంకారపు వ్యాఖ్యలు సరికాదని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్ తీవ్రంగా ఖండించారు. వాటిని వెంటనే ఉప సంహరించుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పాడేరు జిల్లా కేంద్రంలో గరికపాటి ఫోటోను గుడ్లతో అభిషేకం చేస్తూ నిరసన నిర్వహించారు. ఈ కార్యక్రమా న్నినుద్దేశించి రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్ మాట్లాడుతూ, ప్రవచనాల పేరుతో పిల్లలకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకంపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం సరికాదని, పిల్లలు కేవలం కోడిగుడ్డు కోసమే బడికి వస్తున్నారని, చదువు "మిధ్య" అయిపోయిందని అనడం పేద విద్యార్థుల ఆత్మగౌరవాన్ని దెబ్బ తీయడమే అన్నారు. ఏజెన్సీలో అత్యధిక పేదరికం లో విద్యార్థిని, విద్యార్థులు పౌష్టికాహారం అందక వందలాదిమంది చనిపోతున్నారన్నారు. మధ్యాహ్న భోజనం డ్రాపౌట్ తగ్గేందుకు దోహదపడిందని అనేక అంతర్జాతీయ అధ్యయనాలు చెబుతున్నాయన్నారు. విద్యార్థులను "శోభనం పెళ్లి కొడుకు"తో పోల్చడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. విద్యార్థులకు భోజనం, పుస్తకాలు, యూనిఫాం అందించడం ప్రభుత్వ బాధ్యత అని, దానిని "బిచ్చం" అని పిలవడం సిగ్గుచేటన్నారు. పేద పిల్లలకు అందించే భోజనంపై విషం కక్కడం దుర్మార్గమన్నారు. గరికపాటి వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. గరికపాటి క్షమాపణలు చెప్పకపోతే తీవ్రపరిణామాలు ఎదుర్కొంటారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు జీవన్, కార్తీక్ నాయకులు ఐసుబాబు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

# జర్రెల ఘాట్ రోడ్డులో అంబులెన్స్ బోల్తా
## ఐదుగురికి గాయాలు







**జీకే వీధి, పతాకం న్యూస్:** అల్లూరి సీతారామరాజు జిల్లా జి.కె.వీధి మండలం జర్రెల ఘాట్ రోడ్డులో సోమవారం జరిగిన అంబులెన్స్ ప్రమాదం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. జర్రెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి అనారోగ్యంతో ఉన్న వంతల లక్ష్మి అనే రోగిని మెరుగైన చికిత్స నిమిత్తం చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. అంబులెన్స్‌లో రోగితో పాటు ఆమె బంధువులు వంతల చిన్నారావు, వంతల సీతమ్మ, వంతల రూప ప్రయాణిస్తున్నారు. జర్రెల ఘాట్ రోడ్డులోని అత్యంత ప్రమాదకరమైన చివరి మలుపు వద్దకు రాగానే ఒక్కసారిగా అంబులెన్స్ బ్రేకులు విఫలమయ్యాయి. డ్రైవర్ లంబసింగి రమణమూర్తి వాహనాన్ని అదుపు చేసేందుకు ప్రయత్నించినప్పటికీ, వేగంగా ఉన్న అంబులెన్స్ నియంత్రణ కోల్పోయి లోయలో రెండు పల్టీలు కొట్టింది. చివరి మలుపు కావడంతో వాహనం లోయలోకి దూసుకుపోయే ప్రమాదం తప్పిందని పలువురు భావిస్తున్నారు. ?ఈ ఘటనలో వాహనంలో ఉన్న ఐదుగురికీ తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు గమనించి క్షతగాత్రులను చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం, గాయాల తీవ్రత ఎక్కువగా ఉండటంతో ముగ్గురిని మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేశారు. క్షతగాత్రుల్లో ఒకరికి చెయ్యి విరగగా, మరొక మహిళకు తలపై బలమైన గాయం కావడంతో పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఈ ప్రమాదంపై జర్రెల గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఘాట్ రోడ్డు అత్యంత అధ్వాన్నంగా ఉండటం, దానికి తోడు కాలం చెల్లిన పాత అంబులెన్స్‌లను వినియోగించడం వల్లే ఈ ఘోరం జరిగిందని వారు మండిపడుతున్నారు. మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో అత్యవసర సేవలకు కొత్త అంబులెన్స్‌లు మంజూరు చేయడంలో పాలకులు, అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఈ ప్రమాదానికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జర్రెల ప్రాంతానికి కొత్త అంబులెన్స్ కేటాయించాలని, మరమ్మతులకు గురైన ఘాట్ రోడ్డు రహదారిని మరమ్మతు చేయించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# ఏసీబీకి పట్టుబడిన సచివాలయ ఉద్యోగి



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** అక్కయ్యపాలెంలోని లలితా నగర్ సచివాలయం 125లో ఎసిబి అధికారులు దాడులు నిర్వహించారు. రూ.80వేలు లంచం తీసుకుంటున్న వార్డు ఎడ్యుకేషన్ కమ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ పైలా రాజేష్‌ను పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎసిబి డిఎస్‌పి రమణమూర్తి మాట్లాడుతూ, లలితానగర్‌లో నివాసముటున్న ద్వారపురెడ్డి గంగరాజ్యం అతని కుమారుడు గణేష్‌కు రాసిన స్థిరాస్తి సెటిల్ మెంట్ డీడ్ ప్రాసెస్ చేయడానికి సచివాలయ ఉద్యోగి రాజేష్ 90వేలు లంచం డిమాండ్ చేశాడు. చివరకు రూ.80 వేలకు ఒప్పందం కుదిరింది. లంచం ఇవ్వడం ఇష్టం లేని గణేష్ ఎసిబి అధికారులను ఆశ్రయించారు. దీంతో ఎసిబి అధికారుల ప్లాన్ ప్రకారం గణేష్ సచివాలయానికి వెళ్లి రాజేష్‌కు డబ్బులు ఇస్తుండగా ఎసిబి అధికారులు వెళ్లి పట్టుకున్నారు. ఈ దాడుల్లో డిఎస్‌పి హర్షిత, సిఐలు శ్రీనివాస్, వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు. ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే 1064 టోల్ ఫ్రీ ద్వారా ఎసిబిని సంప్రదించాలని సూచించారు.

# డీజిల్ సరఫరాపై ఆంక్షలు
## కంపెనీలకు వంద లీటర్లకు మించి ఇవ్వొద్దని ఆయిల్ కంపెనీల ఆదేశాలు



**మల్కాపురం, పతాకం న్యూస్:** యుద్ధం ప్రభావం డీజిల్ సరఫరాపై పడింది. నౌకలు, బోట్లు, పరిశ్రమలు, తదితర వాటికి మూడు రోజులుగా డీజిల్ పంపిణీ తగ్గించారు. ఇప్పటివరకూ కంపెనీలకు, నౌకలకు, బోట్లకు అవసరమైనంత మేర డీజిల్ సరఫరా చేసేవారు. కానీ ఇప్పుడు వంద లీటర్లకు మించి ఇవ్వొద్దని బంక్‌లకు ఆయిల్ కంపెనీల యజమాన్యాలు ఆదేశాలు జారీచేశాయి. ప్రతిరోజు హెచ్‌పీసీఎల్ మిలినీయం పెట్రోల్ బంక్ నుంచి నౌకలకు, ఐఎస్‌పీఆర్ఎల్ కంపెనీకి, హెచ్‌పీసీఎల్‌లో వివిధ కంపెనీలకు పెద్దఎత్తున డీజిల్ వెళ్లేది. కానీ మూడు రోజులుగా రేషన్ విధించారు. దీంతో వాటికి ఇబ్బందులు మొదలయ్యాయి.

# పక్కాగా జనగణన నిర్వహించాలి




**అరకులోయ, పతాకం న్యూస్:** దేశాభివృద్ధికి జనగణన ఎంతో కీలకమని, దానిని పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ అన్నారు. జనగణనపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ శిక్షణలో ప్రతి అంశాన్నీ క్షుణ్ణంగా నేర్చుకోవాలన్నారు. అల్లూరి జిల్లాలో మండలానికి ఇద్దరు చొప్పున మొత్తం 22 మంది సమర్థులైన ఉపాధ్యాయులను ఈ శిక్షణకు ఎంపిక చేశామన్నారు. వారికి మాస్టర్ ట్రైనర్లు మూడు రోజులు శిక్షణ ఇస్తారని, శిక్షణ పొందిన టీచర్లు మండల స్థాయిలో ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇస్తారన్నారు. జనగణన- 2027కు సంబంధించి పూర్తిగా డిజిటల్ పద్ధతిలోనే జరుగుతుందని, క్షేత్రస్థాయి సమాచారాన్ని సైతం డిజిటల్ రూపంలోనే నమోదు చేయాలన్నారు. అందుకు గాను హాలో యాప్‌ను రూపొందించారన్నారు. జనగణన సమాచారాన్ని డిజిటల్ రూపంలో నమోదు చేయడం ద్వారా తప్పులు లేకుండా పక్కాగా ఉంటుందన్నారు. ముఖ్యంగా శిక్షణ పొందుతున్న టీచర్లు సాంకేతిక అంశాలపై సంపూర్ణ అవగాహన ఏర్పరచుకోవాలన్నారు. అలాగే జనగణన- 2027లో భాగంగా ప్రజల నుంచి పక్కా, సమగ్ర సమాచారాన్ని పొందాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ పీవో టి.శ్రీపూజ, అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్, జిల్లా రెవెన్యూ అధికారి పి.అంబేడ్కర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నీలకంఠం, మాస్టర్ ట్రైనర్లు బి.త్రినాథరావు, పి.జానకీరావు, జిల్లాలోని ఎంపిక చేసిన టీచర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# నంద్యాలలో ఫుడ్ పాయిజన్.. 60 మందికి అస్వస్థత



**నంద్యాల, పతాకం న్యూస్:** నంద్యాలలోని వైఎస్ఆర్ నగర్ బుడగ జంగాల కాలనీలో ఫుడ్ పాయిజన్ కలకలం రేగింది. వివాహంలో మిగిలిన ఆహారాన్ని బుడగ జంగాల కాలనీ వాసులకు పెళ్లి తరఫు వారు పంచిపెట్టారు. ఈ ఆహారాన్ని తిన్న కాలనీలోని 60 మంది అస్వస్థతకు గురయ్యారు. దీంతో వారిని చికిత్స నిమిత్తం నంద్యాలలోని ఆసుపత్రికి తరలించారు. వారిలో 10 మంది చిన్నారులు ఉన్నారు. బాధితుల్లో ఒక మహిళ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. ఈ ఘటనపై సమాచారం అందిన వెంటనే మున్సిపల్ కమిషనర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు ఆసుపత్రికి చేరుకుని, పరిస్థితిని సమీక్షించారు. ఈ ఘటనపై బాధిత కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. ఇది ఫుడ్ పాయిజనా? లేకుంటే.. తాగు నీటిలో ఏమైనా తేడా ఉందా? అనే కోణంలో పరీక్షలు నిర్వహిస్తున్నామని అధికారులు వివరించారు. ఈ ఘటనపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని బాధిత కుటుంబ సభ్యులకు అధికారులు స్పష్టం చేశారు. బాధితులకు మరింత మెరుగైన వైద్యం అందిస్తామని ఈ సందర్భంగా వారికి అధికారులు భరోసా ఇచ్చారు.

# తుప్పు పడుతున్న సీజ్ వాహనాలు



**కొయ్యూరు, పతాకం న్యూస్:** గంజాయి రవాణా, రోడ్డు ప్రమాదాలు తదితర కేసుల్లో సీజ్ చేసిన వాహనాలు పోలీస్ స్టేషన్‌లో తుప్పు పడుతున్నాయి. ఈ వాహనాలను విడిపించుకునేందుకు సంబంధిత వ్యక్తులు రాకపోవడంతో కొయ్యూరు, మంప పోలీస్ స్టేషన్ల ఆవరణలో వందల కొలదీ వాహనాలు ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి. వీటిని భద్రపరిచేందుకు పోలీసులకు తలనొప్పిగా మారింది. ఈ వాహనాలు ప్రతీ ఆరు మాసాలకు ఒక పర్యాయం వేలం వేస్తే ప్రభుత్వానికి ఆదాయం వచ్చే అవకాశం ఉన్నా.. ఆ దిశగా చర్యలు లేవు. కొయ్యూరు, మంప పోలీస్ స్టేషన్ల పరిధిలో 2012 సంవత్సరం నుంచి వివిధ కేసుల్లో సీజ్ చేసిన కార్లు, లారీలు, వ్యాన్‌లు, ఆటోలతో పాటు ద్విచక్ర వాహనాలు వందలాది ఉన్నాయి. ఈ వాహనాలన్నీ కొయ్యూరు పోలీస్ స్టేషన్ సిబ్బంది నివాస గృహాల ముందు, వెనుక స్థలాల్లో ఉన్నాయి. ఇవి వర్షానికి తడుస్తూ.. ఎండకు ఎండుతూ.. తుప్పు పడుతున్నాయి. ప్రమాద బారిన పడినవి అయినా.. లేదా ఇతర కారణాలతో సీజ్ చేసినవి ఉన్నాయి. గంజాయి రవాణా సమయంలో పైలట్‌గా వ్యవహరించే వారి వాహనాలు ఎక్కువగా ఉన్నాయి. వీటిని విడిపించుకునేందుకు చట్టపరంగానూ, న్యాయపరమైన ఇబ్బందులు ఎక్కువ. దీంతో ఆ వాహనాలను విడిపించుకునేందుకు యజమానులు ఆసక్తి చూపడం లేదు. ఇటువంటి కేసుల్లో సీజ్ చేసిన వాహనాలు పెరుగుతూ గుట్టలుగా దర్శనమిస్తున్నాయి. వీటి లోపలకు విష సర్పాలు చేరుతుండడంతో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. కాగా వివిధ కేసుల్లోనూ, ప్రమాదవశాత్తూ స్టేషన్‌కు తీసుకువచ్చిన వాహనాలను రెవెన్యూ అ?ధికారుల సమక్షంలో పంచనామా చేసి ప్రతి ఆరు నెలలకు ఒకసారి బహిరంగ వేలం వేయాలి. ఇలా చేస్తే ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. కానీ ఆ దిశగా చర్యలను చేపట్టడం లేదు. ఈ వాహనాలకు వేలం వేసి ప్రభుత్వానికి ఆదాయం సమకూరేలా చర్యలు చేపడితే మంచిదని పలువురు పేర్కొంటున్నారు.

# నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి



**పాడేరు, పతాకం న్యూస్:** జిల్లాలో వేసవి నేపథ్యంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ఆదేశించారు. వేసవి కార్యాచరణపై కలెక్టరేట్‌లో అల్లూరి, పోలవరం జిల్లాల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్/సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవిలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలు అధికంగా ఉండే ఆస్పత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు, వారపు సంతలు, బస్టాండ్లు, పర్యాటక ప్రదేశాల్లో తక్షణమే చలి వేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో వడదెబ్బ తగలకుండా చూడాలన్నారు. గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగాలని, అవసరమైన తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో పశువులకు నీటి సమస్య లేకుండా నీటి కుంటలు ఏర్పాటు చేయాలన్నారు. వ్యవసాయ, ఉద్యానవన పంటలకు అవసరమైన సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వేసవి నేపథ్యంలో అవసరమైన వైద్య సేవలు అందించేందుకు అన్నీ సిద్ధం చేయాలని, ఆస్పత్రుల్లో వడదెబ్బ నివారణకు అవసరమైన మందులు, ఇతర సామగ్రిని అందుబాటులో ఉంచాలన్నారు. అవసరమైతే తప్ప మధ్యాహ్నం వేళల్లో బయట సంచరించవద్దని, వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు, వేసవి నేపథ్యంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముద్రించిన పోస్టర్‌ను అధికారులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అమిత్‌బర్దార్, పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పీవోలు శ్రీపూజ, స్మరణ్‌రాజ్, శుభం నొక్వాల్, జిల్లా రెవెన్యూ అధికారి పి.అంబేడ్కర్, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఈఈ బీవీ నాగేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ వి.మురళి, జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్, డీఎంహెచ్‌వో కృష్ణమూర్తి, డీఈవో రామకృష్ణారావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మందుబాబులకు వినూత్న ట్రీట్‌మెంట్



**చీరాల, పతాకం న్యూస్:** మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడినవారికి చీరాలలో కోర్టు వినూత్న శిక్ష విధించింది. చీరాల టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ఆరుగురిని మంగళవారం పోలీసులు స్పెషల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. అయితే ఈ కేసును విచారించిన మెజిస్ట్రేట్ నరహరి శ్రీనివాసరావు నిందితుల్లో సత్ప్రవర్తన, బాధ్యతాభావం పెంపొందించేందుకు ప్రత్యేకంగా మూడు రోజులపాటు కోర్టు ప్రాంగణం, పరిసరాలను శుభ్రపరచాలని ఆదేశించారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో ఇలాంటి శిక్షలు అవగాహన కలిగిస్తాయని న్యాయస్థానం అభిప్రాయపడింది. పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కఠిన చర్యలు కొనసాగిస్తామని హెచ్చరించారు.

## వారపు సంతలు వెలవెల



**అనంతగిరి, పతాకం న్యూస్:** గిరిజన ప్రాంతంలోని వారపు సంతలు వెలవెలబోతున్నాయి. ప్రస్తుతం మారుమూల గ్రామాలకు సైతం రహదారి సౌకర్యం ఉండడంతో వర్తకులు నేరుగా గిరిజనుల వద్దకే వెళ్లి అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారు. దీంతో చాలా వరకు గిరిజనులు అటవీ ఉత్పత్తులను వారపు సంతలకు తీసుకురావడం మానేశారు. దీని వల్ల వారపు సంతలు వెలవెలబోతున్నాయి. అరకులోయ మండలంలో శనివారం లోతేరు, శుక్రవారం అరకులోయ, బుధవారం కించుమండ, అనంతగిరి మండలంలో సోమవారం అనంతగిరి, బుధవారం కాశీపట్నం, డముకు, పెదబయలు మండల కేంద్రంలో సోమవారం వారపు సంతలు జరుగుతాయి. అలాగే ముంచంగిపుట్టు మండల కేంద్రంలో శనివారం, చింతపల్లిలో బుధవారం, జి.మాడుగులలో బుధవారం వారపులు సంతలు ఎన్నో ఏళ్లుగా జరుగుతున్నాయి. ఇవి గిరిజనులకు సూపర్ మార్కెట్లనే చెప్పవచ్చు. గిరిజనులు సేకరించిన అటవీ ఉత్పత్తులను వారపు సంతలకు తీసుకువచ్చి విక్రయించి, వారికి కావాల్సిన నిత్యావసర సరుకులను కొనుగోలు చేసి ఇళ్లకు తీసుకు వెళుతుంటారు. అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి వచ్చే వర్తకులు, వినియోగదారులతో వారపు సంతలు కళకళలాడుతుంటాయి. అయితే ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. చాలా గ్రామాలకు రహదారి సౌకర్యం ఉండడంతో వ్యాపారులే నేరుగా గ్రామాలకు వెళ్లి గిరిజనులు సేకరించిన అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారు. దీంతో గిరిజనులు వారపు సంతలకు అటవీ ఉత్పత్తులు తీసుకు రావడం తగ్గించేశారు. ప్రస్తుతం రహదారి సౌకర్యం లేని గ్రామాల నుంచి గిరిజనులు తెచ్చిన అటవీ ఉత్పత్తులు మాత్రమే వారపు సంతల్లో కనిపిస్తున్నాయి. గతంలో ఉదయం ఆరు గంటలకు వారపు సంతలు మొదలై సాయంత్రం ఆరు గంటల వరకు కొనసాగేవి. ప్రస్తుతం ఉదయం 10 గంటలకు మొదలై మధ్యాహ్నం లోపు ఖాళీ అవుతున్నాయి. రహదారి లేని గ్రామాల గిరిజనులే వారపు సంతలకు అటవీ ఉత్పత్తులను తీసుకువచ్చి విక్రయించి, నిత్యావసర సరుకులను కొనుగోలు చేసి వెళుతున్నారు. వర్తకులు కూడా వారపు సంతలకు రావడం తగ్గించేశారు. నేరుగా గ్రామాలకే వెళ్లి గిరిజనుల నుంచి అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేస్తున్నారు. అయితే చుట్టు పక్కల గ్రామాల నుంచి వినియోగదారులు వస్తుండడంతో వారపు సంతలు కొంత వరకు మనుగడ సాగిస్తున్నాయి. రానున్న రోజుల్లో వారపు సంతలు కనుమరుగయ్యే పరిస్థితి ఉందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## వెంటనే రోడ్డు వేయాలని గిరిజనుల ఆందోళన



**బెలగాం, పతాకం న్యూస్:** గిరి శిఖరాల్లో నివసిస్తున్న తమ ఊరుకి రహదారి నిర్మించాలని కొమరాడ మండలం నయా పంచాయతీ గొడ్డాం గ్రామానికి చెందిన గిరిజనులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. తమ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించి.. ప్రాణాలను కాపాఆలని కోరారు. రోడ్డు సౌకర్యం లేకపోవడంతో అత్యవసర వైద్యం కోసం డోలీలే దిక్కవుతున్నాయన్నారు. వైద్యం అందక ప్రాణాలు పోయే పరిస్థితి ఏర్పడుతోందని గిరిజనులు ఆవేదన వెలిబుచ్చారు. రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వ విప్ జగదీశ్వరి శంకుస్థాపన చేశారన్నారు. అయితే పనులు మొదలు పెట్టి వెంటనే అటవీ శాఖ అనుమతులు లేవని రోడ్డు పనులు నిలిచి పోయాయన్నారు. తక్షణమే రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు ఇచ్చి డోలీల మోత నుంచి విముక్తి కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

## గొట్టాబ్యారేజీ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు



**హిరమండలం, పతాకం న్యూస్:** సాగునీటి కోసం రైతులు రోడ్డెక్కారు. హిరమండలంలో గొట్టాబ్యారేజీ దిగువకు వంశధార అధికారులు నీటిని విడిచిపెట్టడంపై మరోసారి ఆందోళన చేపట్టారు. బ్యారేజీ వద్ద మరమ్మతులు చేపట్టాలంటే ఎగువ ప్రాంతంలో నిల్వ ఉన్న నీటిని ఖాళీ చేయాలి. ఈమేరకు వంశధార అధికారులు ఈనెల 17న గొట్టాబ్యారేజీ వద్ద ఒక గేటు పైకెత్తి నీటిని దిగువకు విడిచిపెట్టారు. ఆ సమయంలో ఎడమ కాలువ ఆయకట్టు రైతులు.. దిగువకు నీటిని విడిచిపెట్టొద్దంటూ బ్యారేజీ వద్ద ధర్నా చేశారు. దీంతో అధికారులు బ్యారేజీ దిగువకు నీటి విడుదల నిలిపేశారు. ఎడమ కాలువ ద్వారా నీటిని పంపించారు. బ్యారేజీ పనులు చేపట్టేందుకు సమయం మించిపోతుండటంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉదయం మళ్లీ రెండు గేట్లు పైకెత్తి సుమారు 900 క్యూసెక్కుల నీటిని దిగువకు విడిచిపెట్టారు. విషయం తెలుసుకున్న పిండ్రువాడ, భగీరథపురం, మహాలక్ష్మీపురం, అంబావల్లి తదితర గ్రామాలకు చెందిన రైతులు బ్యారేజీ వద్దకు చేరుకుని నిరసన చేపట్టారు. రహదారిపై బైఠాయించి.. వాహనాలు అడ్డుకుని నినాదాలు చేశారు. నదిలో నీటిని దిగువకు విడిచి పెట్టడం వలన వంశధార ప్రాజెక్టు ఎడమ కాలువ ఆయకట్టు భూములకు సాగునీరు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో వరి, మొక్కజొన్న, రబీ పంటలకు నీరందక నష్టపోతున్నామని వాపోయారు. ఈ నెలాఖరు వరకు ఎడమ కాలువ ద్వారా పంటలకు నీరు విడిచిపెట్టాలని డిమాండ్ చేశారు. లేదంటే ఇక్కడ నుంచి వెళ్లేది లేదని స్పష్టం చేశారు. రైతుల నిరసన నేపథ్యంలో ట్రాఫిక్ నిలిచిపోయింది. ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. బ్యారేజీ సిబ్బంది ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారి ఆదేశాల మేరకు ఎత్తిన గేట్లను కిందకు దించేశారు. దీంతో రైతులు శాంతించి వెనుదిరిగారు. ట్రాఫిక్‌ను పోలీసులు క్లియర్ చేశారు.

## గిరిజన సమస్యలు పరిష్కరిస్తాం



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** గిరిజన సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం సానుకూలంగా ఉందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎస్.బొజ్జిరెడ్డి తెలిపారు. మెళియాపుట్టిలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో.. పలు సమస్యలపై వినతులు స్వీకరించారు. 'మెళియాపుట్టి కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటు చేయాలి. గిరిజన ప్రాంతాల్లో జూనియర్ కళాశాలలు అందుబాటులో లేకపోవడంతో ఉన్నత విద్యకు దూరమవుతున్నాం. జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయాలి. జిల్లాలో కొంతమంది అనర్హులు ఎస్టీ సర్టిఫికెట్లు పొంది ఉద్యోగాలు చేస్తున్నారు. వారిపై చర్యలు తీసుకోవాలి. బెంతుఒరియా కులస్థులు ఎస్టీలు కాదు. కానీ కొంతమంది ఎస్టీ కుల ధ్రువపత్రాలు పొంది ఉద్యోగాలు చేస్తున్నారు. అటువంటి వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలి. మెళియాపుట్టిలో 50 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలి. గిరిజన గ్రామాలకు నిధులు వచ్చినా.. రహదారుల పనులు పూర్తికావడం లేదు. ట్రైకార్ రుణాలు గిరిజనేతరులకు అందజేస్తున్నారు. అర్హులకే ఉద్యోగాలు, రుణాలు అందించేలా చర్యలు చేపట్టాలి. రహదారుల నిర్మాణం పూర్తిచేయాల'ని పలువురు గిరిజనులు రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ బొజ్జిరెడ్డికి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. దశలవారీగా సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. అంతకుముందు దీనబంధుపురం గ్రానైట్ పరిశ్రమను పరిశీలించారు. కార్యక్రమంలో పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, ఎస్టీ కమిషన్ సభ్యులు సునీత, మల్లేశ్వరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు, టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, ఏపీసీఎస్ అధ్యక్షుడు ఎస్.మోహనరావు, మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్.వెంకటరావు, మాజీ ఎంపీపీ బైరిశింగి లక్ష్మీనారాయణ, ధరణి, జడ్పీటీసీ ఎండయ్య, గిరిజన ఉద్యోగ సంఘం నాయకులు చౌదరి లక్ష్మీనారాయణ, శ్రీను, దినకర్, రాజశేఖర్‌రెడ్డి, ఎం.శ్రీధర్, తహసీల్దార్ బి.పాపారావు, ఎంపీడీవో ప్రసాద్‌పండా, ఎంఈవో దేవేంద్రరావు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు: ఎస్పీ మహేశ్వరరెడ్డి




**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** పబ్లిక్ గ్రీవెన్స్‌లో స్వీకరించే ఫిర్యాదుల పరిష్కా రంలో ఎటువంటి జాప్యం లేకుండా త్వరితగతిన విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదే శించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికను నిర్వ హించి 55 మంది నుంచి వినతులు స్వీకరిం చారు. బాధితులతో స్వయంగా మాట్లాడి సమస్య లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్వీకరించిన అర్జీలు, వివరాలను జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా తక్షణమే సంబం ధిత పోలీస్ అధికారు లకు తెలియజేసి చట్టం ప్రకారం చర్యలు తీసు కొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశిం చారు. చంద్రశేఖర్ అనే వ్యక్తి ఏడు ఏళ్లుగా ప్రేమి స్తున్నానని మాయమాటలు చెప్పి తనను వివా హం చేసుకోకుండా మోసం చేశాడని హిరమం డలం మండలం ఓ గ్రామానికి చెందిన యువతి ఫిర్యాదు చేసింది. శ్రీకాకుళం రూరల్ మండలం పొన్నాం పంచాయతీకి చెందిన కె.దుర్గాప్రసాద్ ఆమదాలవలస హెచ్‌డీఆర్‌సీ బ్యాంకు అకౌంట్‌లో ఉన్న రూ.90 వేలు సైబర్ నేరగాళ్లు కాజేశారని, ఈ విషయమై శ్రీకాకుళం రూరల్ స్టేషన్ లో వారం రోజుల కిందట ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు కేసు నమోదు చేయలేదని ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు.

## దత్తత పిల్లలను కన్నబిడ్డల్లా పెంచండి: కలెక్టర్



**పార్వతీపురం, పతాకం న్యూస్:** దత్తత తీసుకున్న పిల్లలను కన్నబిడ్డల్లా ప్రేమతో పెంచి ఉజ్వల భవిష్యత్‌ను అందించాలని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి తల్లిదండ్రులను కోరారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా ప్రత్యేక దత్తత విభాగం ఆధ్వర్యంలో ఒక చిన్నారి దత్తత ప్రక్రియను ఆయన పూర్తి చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన జిల్లాలో శిశుగృహ స్థాపించిన తర్వాత చట్టబద్ధంగా దత్తత ఇవ్వడం ఇదే తొలిసారి అన్నారు. జిల్లా శిశు గృహంలో ఆశ్రయం పొందుతున్న ఆరు నెలల పాప అవంతికను కలెక్టర్ చేతుల మీదుగా తెలంగాణ రాష్ట్రం హన్మకొండ జిల్లాకు చెందిన నాగేంద్రప్రసాద్, శైలజ దంపతులకు అప్పగించారు. ఈ దంపతులు 2022లో సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ పోర్టల్‌లో నమోదు చేసుకోగా నిబంధనల ప్రకారం 2026 మార్చిలో వారికి ఈ అవకాశం దక్కిందన్నారు. పిల్లలు లేనివారు ఎవరైనా సీఏఆర్ఏ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవా లన్నారు. కార్యక్రమం లో జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి డాక్టర్ టి.కనకదుర్గ, జిల్లా బాలల సంరక్షణాధికారి సత్యనారాయణ, శిశు గృహ సిబ్బంది, డీసీపీయూ బృందం పాల్గొన్నారు.

## నేడు మోడీ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** పశ్చిమాసియాలో తలెత్తిన పరిణామాలపై కేంద్ర ప్రభుత్వం ఈనెల 25న అఖిలపక్ష సమావేశం నిర్వహించనుంది. బుధవారం సాయంత్రం 5 గంటలకు ఏర్పాటు చేయనున్న ఈ సమావేశానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షత వహించనున్నట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ సమావేశంలో రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ సైతం హాజరయ్యే అవకాశం ఉంది. ఇరాన్, అమెరికా–ఇజ్రాయెల్ మధ్య యుద్ధం నాలుగో వారానికి చేరుకోవడం, ఆ ప్రభావం భారత్‌లో చమురు, గ్యాస్ పంపిణీపై పడుతుండటంపై పార్లమెంటులో సమగ్ర చర్చ జరగాలని విపక్షాలు పట్టుబడుతున్నాయి. ఈ నేపథ్యంలో యుద్ధ ప్రభావంతో దేశం ఎదుర్కొంటున్న సవాళ్లపై ప్రధానమంత్రి సోమ, మంగళవారం ఉభయసభల్లోనూ మాట్లాడారు. దీనికి ముందు విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, పెట్రోలియం శాఖ మంత్ర హర్దీప్ పురి సైతం లోక్‌సభ, రాజ్యసభలో ప్రకటనలు చేశారు. ఈ క్రమంలో పార్లమెంటులో చర్చకు మారుగా అఖిలపక్ష సమావేశం ఏర్పాటుకు కేంద్రం నిర్ణయం తీసుకుందని చెబుతున్నారు.

## ఆ తరం వెళ్ళిపోతోంది.!



ఒక్కొక్కరుగా మనకు శాశ్వత వీడ్కోలు పలుకుతూ ఒక తరం కనుమరుగవుతోంది.
అన్నం తినేముందు ఇతరుల ఆకలిని గుర్తించిన తరం.
ఇరుకు ఇళ్లల్లో గొప్ప ప్రేమతో బ్రతికిన తరం. బాధ్యతల్ని ఎరిగిన తరం.
'నేను' అనకుండా 'మనం' అంటూ బతికిన తరం.
డిగ్రీలు లేకున్నా, జీవితాన్ని చదివిన తరం.
గడియారం లేకున్నా, సమయాన్ని సద్వినియోగం చేసుకున్న తరం.
ఇంటర్నెట్ చూడకుండా జ్ఞానాన్ని నింపుకున్న తరం.
కాలిక్యులేటర్ లేకున్నా లెక్కలు చేయగలిగిన తరం.
మొబైల్ ఫోన్‌లు లేకున్నా స్నేహ సంభాషణలకు లోటు లేని తరం.
ఏసీలు లేకున్నా వినోదంగా కాలం గడిపిన తరం.
జీపీఎస్‌లు లేకున్నా గమ్యం ఖచ్చితంగా చేరగలిగిన తరం.
సాంకేతికత లేకున్నా సుఖసంతోషాలతో బతికిన తరం.
ఏసీలు, కూలర్లు లేకున్నా
ఆరుబయట హాయిగా నిద్రించిన తరం.
మినరల్ వాటర్ కు బదులు చెరువు/బావి నీళ్లు తాగి ఆరోగ్యంగా బతికిన తరం.
పిజ్జాలు, బర్గర్లు కాకుండా పీచు మిఠాయిలు, పేలాలు తిని ఆనందంగా బ్రతికిన తరం.
రాత్రిళ్ళు ఇంటి అరుగులపై హాయిగా కబుర్లు చెప్పుకుంటూ ఆనందంగా బ్రతికిన తరం.
ఆరో ఏడు వచ్చే వరకు పిల్లల బాల్యాన్ని ఆటపాటలతో నింపిన తరం.
ఆ తర్వాత పైసా ఫీజు లేని సర్కారు బడుల్లో తెలుగు మీడియంలో పిల్లలను చదివించి - అటు తెలుగు లోనూ, ఇటు ఇంగ్లీష్ లోనూ పండితులు అయ్యేలా పిల్లలను తీర్చిదిద్దిన తరం.
కిలోమీటర్ల దూరాన్ని సైతం అవలీలగా నడవగలిగిన తరం.
క్రమశిక్షణ తప్పిన పిల్లవాడికి స్కూల్ లో టీచర్ నాలుగు దెబ్బలు వడ్డిస్తే - వాడికి మరో పది దెబ్బలు ఇంట్లో వడ్డించిన తరం.
వీధి నాటకాలను, తోలు బొమ్మలాటలను, బుర్రకథలను ఆస్వాదించిన తరం.
సెన్సార్ అవసరం లేని సందేశాత్మక నలుపు-తెలుపు సినిమాలు చూసిన తరం.
ఇంటిముంగిటిని ముగ్గులతో అలంకరించిన తరం.
పనిమనుషులతో, యోగాలతో, జిమ్‌లతో పని లేకుండా, బండెడు చాకిరీ చేసుకుంటూ, చెమటను చిందించి వందేళ్లు బతికిన తరం.
బంధాలకు, బంధుత్వాలకు విలువనిచ్చిన తరం.
ఆస్తులకన్నా, ఆప్యాయతలకు, అనుబంధాలకు ప్రాముఖ్యతనిచ్చిన తరం.
ఉమ్మడికుటుంబాలుగా ఆనందంగా జీవించిన తరం.
భేదాభిప్రాయాలున్నా అందర్నీ కలుపుకుని వెళ్లగలిగిన తరం.
వ్యాపారంలో కల్తీకి చోటివ్వని తరం. ఇతరుల మేలు కోరుకున్న తరం.
నీతి నిజాయితీలతో మోసాలు చెయ్యకుండా బతికిన తరం.
రాళ్లు తిన్నా అరిగించుకోగలిగిన తరం.
కార్పొరేట్ హాస్పిటల్స్ లేకున్నా ఆరోగ్యంగా జీవించిన తరం.
హార్ట్ ఎటాక్, క్యాన్సర్ ల గురించి తెలియని తరం.
బీపీలు, షుగర్ లను దరిచేరనీయని తరం.
లాంతర్లతో జీవితంలో వెలుగులు నింపుకున్న తరం.
కష్టాల్ని ధైర్యంగా ఎదుర్కొన్న తరం.
ఎంత ఉన్నా ఇంకా ఇంకా కావాలనే దురాశ లేకుండా ఆనందంగా జీవించిన తరం.
ఆడంబరాలకు దూరంగా ఉన్న తరం.
పోస్ట్ కార్డులపై సంభాషణలు జరిపిన తరం.
త్యాగాలతో పిల్లల భవిష్యత్ కు పునాదులు వేసిన తరం.
కులమతాలకు అతీతంగా సోదరభావంతో బతికిన తరం.
అలాంటి తరంలోని అపురూపమైన వ్యక్తులు నేడు ఒక్కొక్కరుగా మనల్ని విడిచి వెళ్లిపోతున్నారు.
వారిని కోల్పోతుంటే సర్వం కోల్పోతున్నట్టుగా అనిపిస్తుంది.
వెళ్లిపోతున్న ఆ తరం వాళ్ల నుండి
ఈ తరం ఏమీ నేర్చుకోకపోతే - భవిష్యత్తు అంధకారమే!

## 'శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను విధుల్లోకి తీసుకోవాలి'




**అరసవల్లి, పతాకం న్యూస్:** నగర పాలక సంస్థలో పనిచేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎన్.శరత్ కుమార్‌ను అకారణంగా తొలగిం చారని, తక్షణం విధుల్లోకి తీసుకోవాలని సీఐటీ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక మునిసి పల్ కార్యాలయం నుంచి జడ్పీ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 16 సంవ త్సరాలుగా క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగిని అకారణంగా విధుల నుండి తొలగిం చారని, ఎమ్మెల్యే, మంత్రులు తక్షణమే పరిష్కా రం చూపాలన్నారు. కార్మికులపై పనిభారం తగ్గిం చాలని కోరారు. శరత్‌కుమార్ వెంటనే విధుల్లోకి లేకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం గ్రీవెన్స్‌లో అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్‌కు వినతిపత్రం అంద జేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర కన్వీ నర్ ఆర్.ప్రకాశరావు, ఎ.గణేష్, సంతోష్, రాంబా బు, చిట్టిబాబు, యుగంధర్ పాల్గొన్నారు.

## హత్య కేసులో నలుగురు అరెస్టు



**గుంటూరు, పతాకం న్యూస్:** మద్యం మత్తులో భర్త పెడుతున్న శారీరక, మానసిక వేధింపులు భరించలేక, తన సోదరి దంపతులు, మరో వ్యక్తి సహాయంతో భార్య తన భర్తను హత్య చేసిన ఉదంతం ప్రత్తిపాడులో వెలుగుచూసింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ జిల్లా పోలీసు కార్యాలయంలో మీడియాకు వెల్లడించారు. ఈనెల 19న ప్రత్తిపాడు మండలం యనమదల, ఈదులపాలెం గ్రామ పరిధిలోని కాటూరు మెడికల్ కాలేజీ ఎదుట ఉన్న చెరువులో గుర్తుతెలియని మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, మృతదేహాన్ని పరిశీలించగా అది ఒక యువకుడిదని, అతడిని హత్య చేసి మూటగట్టి, నడుముకు రాయి కట్టి నీటిలో పడవేసినట్లు గుర్తించారు. మృతుడు దాసరిపాలెం గ్రామానికి చెందిన తన్నీరు వెంకటేశ్వర్లు (30)గా దర్యాప్తులో నిర్ధారణ అయింది. డిఎస్పీ మధుసూధనరావు ఆధ్వర్యంలో సిఐ శ్రీనివాసరావు, ఎస్ఐ నరహరి ప్రత్యేక బృందాలతో విచారణ చేపట్టారు. ఈ క్రమంలో గుంటూరు రూరల్ మండలం దాసరిపాలెంలో ఒక కుటుంబం తమ ఇంటి సామాను, పశువులను తీసుకుని హుటాహుటిన గ్రామం విడిచి వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వారిని పట్టుకునేందుకు ప్రయత్నించగా పారిపోవడంతో వారి వివరాలు సేకరించి లోతైన విచారణ చేపట్టగా వీరే వెంకటేశ్వర్లును హత్యచేసినట్లు నిర్ధారణైంది. నిందితుల్లో హతుడి భార్య ఉప్పుతల లక్ష్మి, ఆమె అక్క బావలైన సిద్ధి అంకమ్మ, సిద్ధి సురేష్‌తో పాటు నల్లపాడు వద్ద లక్ష్మీనరసింహ కాలనీకి చెందిన డి.ఓంకార్ అనే యువకుడు కలిసి వెంకటేశ్వర్లును తాళ్లతో కట్టేసి కర్రలతో కొట్టి చంపారు. శవాన్ని ఇంట్లోనే పూడ్చిపెట్టాలనుకున్నా వాసన వచ్చి చుట్టుపక్కల వారికి అనుమానం కలుగుతుందనే భయంతో మిరపకాయల గోనె సంచిలో శవాన్ని పెట్టి, మోటార్ సైకిళ్లపై తీసుకెళ్లి చెరువులో పడేశారు. నిందితులు కొండ ప్రాంతాల్లో తలదాచుకుని దాసరిపాలెం నుంచి తెనాలికి పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. వీరిని కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండ్ విధించినట్లు ఎస్పీ వివరించారు.

## రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయుల నిరాహార దీక్షలు




**మక్కువ, పతాకం న్యూస్:** సమస్యల సాధన కోరుతూ .... ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు .... మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులు రణభేరి నిరాహార దీక్షలు చేపట్టారు. 11వ పీఆర్సీ గడువు ముగిసి 32 నెలలు అయినా గానీ నేటికి ముఖ్యమంత్రి 12వ పీఆర్సీ కమిటీ ఛైర్మన్ నియమించలేదని, వెంటనే పీఆర్సీ కమిటీ వేసి 29 శాతం ఐఆర్ ప్రకటించాలన్నారు. పెండింగ్ లో ఉన్న 4 డిఎలు ప్రకటించాలని, కొండలా పేరుకుపోయిన రూ.30,000 కోట్లు ఆర్థిక బకాయిలు చెల్లించడానికి రూట్ మ్యాప్ ప్రకటించాలని, సిపిఎస్ రద్దు చేయాలని, మెమో 57 అమలు చేసి 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ అమలు చేయాలని, ఎం టి ఎస్ టీచర్లను, కె జి బి వి కాంట్రాక్ట్ టీచర్లను రెగ్యులర్ చేయాలని, ఉద్యోగ ఉపాధ్యాయుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## నాణ్యత ప్రమాణాలతో రహదా నిర్మాణం చేయాలి

**కృష్ణా, పతాకం న్యూస్:** కూటమి ప్రభుత్వ సహకారంతో నియోజకవర్గంలో రహదారుల నిర్మాణం వేగవంతం చేసినట్లు అవనిగడ్డ నియోజవర్గ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. మంగళవారం చల్లపల్లి మండలం లక్ష్మీపురం పంచాయతీ రామానగరంలో ఓ.ఆర్.సీ క్లబ్ పక్కన రూ.45 లక్షలతో చల్లపల్లి-మచిలీపట్నం ఆర్ అండ్ బీ రోడ్డు వద్ద నుంచి హైవే వరకూ నిర్మిస్తున్న హైవే కనెక్టివిటీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పంచాయతీరాజ్ గ్రామీణ అభివఅద్ధి శాఖ మంజూరు చేసిన ఉపాధి హామీ పథకం నిధులతో పాటు, సాస్కి నిధులతో నియోజకవర్గంలో గ్రామీణ రహదారులు అభివఅద్ధి చేస్తున్నట్లు తెలిపారు.

# పాలిటెక్నిక్‌తో భవితకు భరోసా.. ఏప్రిల్ 25న పాలిసెట్



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** పాలిటెక్నిక్ కోర్సులకు మరింత డిమాండ్ పెరుగుతోంది. పదోతరగతి పూర్తయిన తర్వాత మూడేళ్లపాటు ఈ కోర్సు పూర్తిచేస్తే నైపుణ్యంతో పాటు ఉద్యోగం గ్యారంటీ అనే భావన ఉంది. అందుకే చిన్నవయసులోనే జీవితంలో స్థిరపడాలను కునేవారు ముందుగా ఈ కోర్సులనే ఎంచుకుంటున్నారు. ఈ కోర్సులో చేరేందుకుగాను వచ్చేనెల 25న పాలిసెట్ నిర్వహించనున్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై ఆసక్తిగల అభ్యర్థులు వచ్చే నెల 4వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. పాలిసెట్ రాసేందుకు ఓసీ, బీసీ విద్యార్థులు రూ.400, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.100 ఫీజు చెల్లించాలి. శ్రీకాకుళంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

ఉమ్మడి జిల్లాలో శ్రీకాకుళంలో రెండు, ఆమదాలవలస, టెక్కలి, సీతంపేటలో చెరొకటి వంతున మొత్తం ఐదు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. మరో నాలుగు ప్రైవేటు కళాశాలలు కూడా ఉన్నాయి. ప్రభుత్వ కళాశాలల్లో 663 సీట్లు, ప్రైవేటు కళాశాలల్లో 1,500 సీట్లు మొత్తం 2,163 సీట్లు ఖాళీ ఉన్నాయి. పాలిటెక్నిక్ కోర్సు పూర్తయిన తర్వాత ఈసెట్ రాసి నేరుగా ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరంలో చేరవచ్చు.

భౌతికశాస్త్రం, రసాయన శాస్త్రం, గణితం సబ్జెక్ట్‌ల్లో 120 మార్కులకు ఆబ్జెక్టివ్ పద్ధతిలో పాలిసెట్ ఉంటుంది. పదో తరగతి స్టాండర్డ్ మేరకు ప్రశ్నలు ఉంటాయి. ఇందులో వచ్చిన మార్కుల ఆధారంగా ర్యాంకులు ప్రకటిస్తారు. ర్యాంకుల ఆధారంగా అభ్యర్థుల ఆప్షన్ మేరకు కళాశాలలు, కోర్సుల కేటాయిస్తారు. జిల్లాలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో కంప్యూటర్స్, సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ తదితర కోర్సులు ఉన్నాయి. విద్యార్థుల ఆసక్తి మేరకు ఏ కోర్సులో చేరినా ఇష్టంగా చదివితే ఉజ్వల భవిత పొందవచ్చని విద్యావేత్తలు చెబుతున్నారు. డిప్లమో పూర్తిచేసినవారు చాలా రంగాల్లో ఉన్నతంగా స్థిరపడ్డారు.

పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరాలనుకున్న విద్యార్థులు పాలిసెట్ రాసేందుకు నిర్దేశించిన గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని, . ఏప్రిల్ 25న పాలిసెట్ నిర్వహిస్తారని, పాలిసెట్‌లో మంచి ర్యాంకు సాధనకు విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలని, పాలిసెట్ కోసం ఆసక్తి గల విద్యార్థులకు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నామని శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు తెలియజేశారు.

# వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు కుదేలు!

**కృష్ణా జిల్లా, పతాకం న్యూస్:** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ చేస్తోన్న యుద్ధం వ్యవసాయ అనుబంధ పరిశ్రమలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పరికరాల తయారీకి అవసరమైన కట్టర్లకు ఉపయోగించే గ్యాస్ సిలిండర్ల సరఫరా నిలిచిపోవడంతో వివిధ పరికరాల తయారీ యూనిట్ల నిర్వాహకులు ఆర్డర్ ప్రకారం పరికరాలను సకాలంలో పూర్తి చేసి కస్టమర్లకు అందించలేకపోతున్నారు. 20 రోజుల క్రితం కిలో రూ.63 ఉన్న ఇనుము ధర రోజురోజుకు పెరిగి ప్రస్తుతం రూ.78కు చేరింది. కృష్ణా జిల్లా గుడివాడ పట్టణం వ్యవసాయ అనుబంధ పరికరాల తయారీ పరిశ్రమకు పెట్టింది పేరు. అక్కడ ఆటో నగర్‌తోపాటు పట్టణ పరిసర ప్రాంతాల్లో 18 పెద్ద తరహా, 16 మధ్య తరహా పరికరాల తయారీ యూనిట్లు ఉన్నాయి. మరో 17 వర్కుషాపులు నడుస్తున్నాయి. ట్రాక్టర్ విడి భాగాలు ట్రాలీ (ట్రక్కు), కల్టివేటర్ (నాగళ్లు), మడ్ వీల్స్ (దమ్ము చక్రాలు), ప్లవ్, డిస్క్, మొక్కజొన్న, మినుము నూర్పిడి పరికరాలు వీటిల్లో తయారవుతాయి. ఇందుకు ఇనుమును ఉపయోగిస్తారు. ఆయా పరికరాలను తయారు చేసేందుకు గ్యాస్ ద్వారా కటింగ్ చేయాల్సి ఉంటుంది. వీటికి గత 12 రోజుల నుంచి కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరాను ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో, పరికరాల తయారీ నిలిచిపోయింది. ప్రభుత్వం త్వరలోనే గ్యాస్ సరఫరాపై నిర్ణయం తీసుకుని పునరుద్ధరిస్తుందన్న ఆశతో తమకు వచ్చిన ఆర్డర్ల డెలివరీ సమయాన్ని ఆయా యూనిట్ల నిర్వాహకులు పొడిగించుకుంటూపోతున్నారు. అయితే, ఎప్పుడు డెలివరీ అవుతుందో తెలియకపోవడంతో కొందరు కస్టమర్లు తమ ఆర్డర్లను రద్దు చేసుకుంటున్నారు. దీంతో, యూనిట్ల నిర్వాహకులు నష్టపోతున్నారు. ఒక్కో ట్రాలీ తయారీకి 1,700 కిలోల నుంచి 2 వేల కిలోలు, కల్టివేటర్లకు 300 కిలోలు, దమ్ము చక్రాలకు 400 కిలోల ఇనుము ఉపయోగిస్తారు. ఈ నేపథ్యంలో 1700 కిలోల ట్రాలీ వ్యయం రూ.1.75 లక్షల నుంచి 2 లక్షలా 500 రూపాయలకు చేరింది. అంటే,



రూ.25,500 పెరిగింది. ఇక్కడ తయారయ్యే ఇతర పరికరాల ధరలు కూడా పెరిగాయి. ఇక్కడున్న తయారీ యూనిట్లు, వర్కు షాపుల్లో ప్రతి నెలా సగటున 55 నుంచి 60 ట్రాలీలు తయారు చేస్తారు. కటింగ్‌కు అవసరమైన గ్యాస్ సమస్యలతో చిన్న చిన్న ఆర్డర్లు కూడా సకాలంలో తయారు చేసి ఇవ్వలేకపోతున్నామని, ఇనుము ధరలు పెరగడంతో ఆర్డర్లు ఇచ్చేందుకు కస్టమర్లు ముందుకు రావడం లేదని పరికరాల తయారీ యూనిట్ల నిర్వాహకులు వాపోతున్నారు.

## జోరుగా ఇసుక అక్రమ తవ్వకాలు..!

### చోద్యం చూస్తున్న అధికారులు

### దర్జాగా రోజుకు 20 నుంచి 25 వరకూ ట్రాక్టర్ల ద్వారా రవాణా చేస్తున్న అక్రమార్కులు



**మక్కువ, పతాకం న్యూస్:** మక్కువ మండలం డి.శిర్లాం గ్రామంలో గోముఖి , సువర్ణముఖి నదులు కలిసే చోట జోరుగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. రాత్రి, పగలని తేడా లేకుండా ఇక్కడి నుంచి పార్వతీపురం, బొబ్బిలి పట్టణాలకు యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నారు. ఎటువంటి అనుమతుల్లేకుండా ఇసుకాసురులు తవ్వకాలు జరిపి అక్రమ రవాణా చేస్తున్నా.. స్పందించే వారే కరువయ్యారు. రోజుకు 20 నుంచి 25 వరకు ట్రాక్టర్ల ద్వారా ఐదారు ట్రిప్పులతో ఇసుకను తరలిస్తున్నారంటే ఇక్కడి పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇందుకోసం దాదాపు 40మంది కూలీలను వినియోగిస్తున్నారు. వారితో నదిలో తవ్వకాలు చేపట్టి.. ట్రాక్టర్లకు ఇసుకను లోడు చేయిస్తున్నారు. కాగా రోజూ తవ్వకాలు చేపడుతుండడం వల్ల నదుల్లో భారీ గుంతలు ఏర్పడ్డాయి. మరోవైపు ఇసుక ట్రాక్టర్ల రాకపోకల కారణంగా వెంకటభైరిపురం నుంచి శిర్లాం గ్రామానికి నదిగుండా వెళ్లే దారంతా పెద్దపెద్ద గోతులతో అధ్వానంగా మారింది. వేసవిలో ఆ రెండు గ్రామాల ప్రజలు నదిదాటి రాకపోకలు సాగిస్తుంటారు. అయితే నదిలో గోతులు ఏర్పడడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆయా గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

## మత్స్యకారుల భారీ ర్యాలీ




**తిరుపతి, పతాకం న్యూస్:** తిరుపతి జిల్లా సూళ్లూరుపేట పట్టణంలో మత్స్యకారులు మంగళవారం భారీ ర్యాలీ చేసి ఆందోళన చేపట్టారు. స్థానిక బస్టాండ్ సమీపంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి ప్రారంభమైన ఈ పాదయాత్రలో సుమారు 1000 మంది మత్స్యకారులు పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహం నుంచి నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు నినాదాలు చేస్తూ శాంతియుతంగా ర్యాలీ నిర్వహించారు. మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలని, జీవనోపాధి కోసం అవసరమైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆర్డీఓ కార్యాలయానికి చేరుకున్న అనంతరం, తమ సమస్యలను వినత పత్రం ద్వార ఆర్డీఓకు వివరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ... తమ సమస్యలు త్వరగా పరిష్కరించకపోతే మరింత పెద్ద స్థాయిలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. పోలీసుల పర్యవేక్షణలో ర్యాలీ ప్రశాంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో స్థానిక మత్స్యకార సంఘాల నాయకులు, మహిళలు, యువకులు భారీగా పాల్గొన్నారు.

## ఇది పరిష్కారంలేని సమస్య.. కాంగ్రెస్ పార్టీని వీడటంపై జీవన్ రెడ్డి వ్యాఖ్య

**హైదరాబాద్, పతాకం న్యూస్:** తాను పార్టీ వీడటాన్ని ఉద్దేశించి, జగిత్యాల నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆయనతో భేటీ అయ్యారు. అనంతరం జీవన్ రెడ్డి మాట్లాడుతూ, ఇది పరిష్కారం లేని (పార్టీని వీడటం) సమస్యగా అభివర్ణించారు. ఈ సమస్యకు పరిష్కారం తన వద్దలేదని, అలాగే కాంగ్రెస్ వద్ద కూడా లేదని వ్యాఖ్యానించారు. బుధవారం ఉదయం అందరూ స్థానిక బండారి గార్డెన్‌కు రావాలని కార్యకర్తలు, అభిమానులకు పిలుపునిచ్చారు. భవిష్యత్తు పయనం ఎలా ఉంటుందో తెలియదని అన్నారు. అధిష్ఠానం తనను బుజ్జగించలేదని, తాను పార్టీ వీడి వెళుతున్నానని తెలిసి, ఇలా వచ్చి అలా వెళుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఉంటూ స్వపక్షంతో యుద్ధం చేయలేనని అన్నారు. తన నిర్ణయాన్ని ప్రకటిస్తానని వెల్లడించారు.

## ‘పది’ పరీక్షలను తనిఖీ చేసిన కలెక్టర్



**గుంటూరు, పతాకం న్యూస్:** నగరంలోని హిందూ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా సందర్శించి పదో తరగతి పరీక్షలను తనిఖీ చేశారు. విద్యార్థులు పరీక్షలు రాస్తున్న తీరును, పరీక్షా కేంద్రంలో కనీస అవసరాలైన తాగునీరు, వైద్య శిబిరాలు ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షల సమయంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా, విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకొనుటకు బస్ సౌకర్యం తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు, పరీక్షల సమయంలో చుట్టుప్రక్కల జెరాక్స్ మెషిన్ దుకాణాలు మూసివేయడం అంశాలను గురించి వాకబు చేశారు. జిల్లా విద్యా శాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా మాట్లాడుతూ జిల్లాలో 149 కేంద్రాల్లో 27,699 మందికి పరీక్షలు జరుగుతున్నట్లు చెప్పారు.

## గ్యాస్ సరఫరా చేయాలని రాస్తారోకో



**పల్నాడు, పతాకం న్యూస్:** గ్యాస్ సరఫరా చేయాలని కోరుతూ పలువురు వినియోగదార్లు స్థానిక అద్దంకి - నార్కెట్‌పల్లి రాష్ట్ర రహదారిలోని వై జంక్షన్ వద్ద ఖాళీ సిలిండర్లతో రాస్తారోకో చేపట్టారు. నిబంధనల మేరకు ఆన్‌లైన్‌లో గ్యాస్ బుకింగ్ చేసుకున్నామని, ఒటిపి వచ్చి ఐదురోజులైనా సిలిండర్‌ను సరఫరా చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్ గోడౌన్ వద్దకు వెళ్లగా ‘నో స్టాక్’ బోర్డు పెట్టారని, సిబ్బంది కూడా సరైన సమాధానం చెప్పడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాస్తారోకోతో వాహనాలు భారీగా నిలిచిపోవడంతో ఎస్ఐ కె.సతీష్ అక్కడికి చేరుకుని ఆందోళనకార్లకు సర్ది చెప్పారు. అనంతరం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

## రైలు కిందపడి స్నేహితుల ఆత్మహత్య





**చిత్తూరు, పతాకం న్యూస్:** తడ మండల పరిధిలోని కొండూరు రైల్వేగేటు వద్ద రాత్రి ఇద్దరూ స్నేహితులు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు.సూళ్లూరుపేట మండలం పిండిపాలేనికి చెందిన డమాయి కల్యాణ్ (24), బేరిపట్రంగానికి చెందిన జడా సునీల్ కుమార్ (23) సాయంత్రం ఇంటి నుంచి మోటారు సైకిల్‌లో తడ మండలం కొండూరు రైల్వేగేటు వద్దనున్న బ్రిడ్జి వద్దకు చేరుకున్నారు. అక్కడ మోటారు సైకిల్‌ను నిలిపి ఇద్దరూ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. కల్యాణ్‌కు రెండు నెలల క్రితమే వివాహమైంది. మృతదేహాలను సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

## కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల ఆందోళన



**అమరావతి, పతాకం న్యూస్:** జొన్న, మొక్కజొన్న, శనగ పంటలను మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరుతూ రైతులు రైతుసంఘం ఆధ్వర్యంలో గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని పలు మండల కేంద్రాల్లో ఆందోళనలు చేపట్టారు. ఇందులో భాగంగా శావల్యాపురం తహశీల్దార్ కార్యాలయాన్ని రైతులు ముట్టడించారు. అనంతరం రోడ్డుపై బైఠాయించిన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతుసంఘం నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గంలో వేలాది ఎకరాల్లో మొక్కజొన్న పంటను రైతులు సాగు చేశారని, పంట చేతికొచ్చి 15 రోజులు దాటినా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదని విమర్శించారు.

## కార్డెన్ సెర్చ్‌లో మారణాయుధాలు, వాహనాలు స్వాధీనం



**చిలకలూరిపేట, పతాకం న్యూస్:** పట్టణంలోని సంజీవ్‌నగర్, ఆదిఆంధ్ర కాలనీల్లో తెల్లవారుజామున డిఎస్‌పి హనుమంతరావు ఆధ్వర్యంలో 96 మంది పోలీసులు కార్డెన్ సెర్చ్ చేపట్టారు. 12 మారణాయుధాలతోపాటు సరైన పత్రాలు లేని 26 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఎన్నికలు రానున్న నేపథ్యంలో అల్లర్లకు వీల్లేకుండా సమస్యాత్మక ప్రాం తాల్లో తనిఖీలు చేస్తున్నామని డీఎస్‌పి చెప్పారు. అనుమా నితులు, రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తామని అన్నారు. గంజా యి, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా తమ పిల్లలపై తల్లిదండ్రులు శ్రద్ధపెట్టాలని సూచించారు. గంజాయి వాడుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాల న్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను తప్పనిసరిగా పెట్టుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపిఎస్ జె.నిరంజన్, అర్బన్ సిఐ రమేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## సిఐటియు ఆధ్వర్యాన సెక్యూరిటీ గార్డ్స్ ధర్నా

**కాకినాడ, పతాకం న్యూస్:** జీతాలు, సెలవులు, ఇతర సమస్యలపై తక్షణమే యూనియన్‌తో చర్చలు జరపాలంటూ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి, రంగరాయ మెడికల్ కళాశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న సెక్యూరిటీ గార్డ్స్ ధర్నా నిర్వహించారు. జిజిహెచ్ మెయిన్ గేటు వద్ద సిఐటియు ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో సిఐటియు నగర కో కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడారు. కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ యాజమాన్యం నిర్లక్ష్యం వీడాలన్నారు. జూన్ 1 నుంచి జిజిహెచ్, ఆర్ఎంసిలలో సెక్యూరిటీ నిర్వహణ కాంట్రాక్టును కార్తికేయ సంస్థ పొందిందని అన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పిఎఫ్, ఇఎస్ఐ చెల్లిస్తూ సెక్యూరిటీ గార్డ్స్‌కి నెలకు రూ.13,960 చెల్లించాల్సి ఉండగా కేవలం రూ.12,099 మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. అమలులో ఉన్న క్యాజువల్ లీవులను రద్దు చేసి కార్మికుల జీతాల్లో కోత విధిస్తున్నదని అన్నారు. సిఐటియులో చేరిన సెక్యూరిటీ గార్డ్స్‌ను విధులకు దూరం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే జిజిహెచ్ సూపరింటెండెంట్, అడ్మినిస్ట్రేటర్‌లకు రాతపూర్వకంగా తెలిపామన్నారు. వారు జోక్యం చేసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నామన్నారు. లేనిపక్షంలో మార్చి 25 నుంచి జిజిహెచ్ సెక్యూరిటీ కార్యాలయం వద్ద నిరాహారదీక్షలు చేపడతామని హెచ్చరించారు.

# తరచూ నెలసరి నొప్పులు వస్తున్నాయా..?



మహిళలు నెలసరి నొప్పులను సాధారణంగా భావిస్తారు. చాలా మంది మహిళలు వీటిని అసలు పట్టించుకోరు. అయితే ఈ నొప్పి తీవ్రంగా మారి రోజువారీ జీవితాన్ని ప్రభావితం చేసే స్థాయికి చేరుకుంటే, దాన్ని సాధారణంగా తీసుకోవద్దని వైద్యులు సూచిస్తున్నారు. ఇలాంటి తీవ్రమైన నొప్పులు సెకండరీ డిస్మెనోరియా అనే తీవ్రమైన సమస్యకు సంకేతం కావొచ్చని వారుహెచ్చరిస్తున్నారు. తీవ్రమైన లక్షణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయకూడదని ప్రతి నెల మందులపై ఆధారపడటం, స్కూల్ లేదా పనికి వెళ్లలేకపోవడం వంటి పరిస్థితులు ప్రమాద సూచికలుగా భావించా లని వైద్యులు చెబుతున్నారు. అలాగే నొప్పి కాలక్రమేణా నొప్పి తీవ్రత పెరగడం లేదా పీరియడ్ సమయంలో కాకుండా ఇతర సమయాల్లో కూడా నొప్పి ఉండడం వంటి వాటిని తేలికగా తీసుకోకూడదని ఈ లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని నిపుణులు సూచిస్తున్నారు. నెలసరి నొప్పులను సాధారణంగా రెండు రకాలుగా విభజిస్తారు. మొదటిది ప్రైమరీ డిస్మెనోరియా. ఇది సాధారణంగా ఏదైనా ప్రత్యేక కారణం లేకుండా వస్తుంది. ఇది ప్రోస్టా గ్లాండిన్స్ అనే హార్మోన్‌లాంటి రసాయనాల వల్ల గర్భాశయం సంకోచాలు కలగడం వల్ల వస్తుంది. సాధారణంగా మందులు, జీవనశైలి మార్పులతో దీనిని నియంత్రించవచ్చు. ఇక రెండవది సెకండరీ డిస్మెనోరియా. ఇది గర్భాశయానికి సంబంధించిన ఇతర ఆరోగ్య సమస్యల వల్ల వస్తుంది. దీని వల్ల వచ్చే నొప్పి ఎక్కువగా తీవ్రంగా ఉంటుంది, కాలక్రమేణా పెరుగుతుంది. అదనంగా అధిక రక్తస్రావం, అలసట, పీరియడ్ కాకుండా కూడా పెల్విక్ నొప్పి, మల విసర్జన లేదా లైంగిక సంబంధాల సమయంలో నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి. సెకండరీ డిస్మెనోరియాకు ప్రధాన కారణాలలో ఒకటి ఎండోమెట్రియోసిస్. ఇందులో గర్భాశయపు లోపలి పొరల మాదిరిగా ఉండే కణజాలం గర్భాశయం బయట పెరుగుతుంది. ప్రపంచవ్యాప్తంగా సుమారు 10 శాతం మహిళలు ఈ సమస్యతో బాధపడుతున్నారు. భారత దేశంలో సుమారు 4.2 కోట్ల మంది మహిళలు ఈ వ్యాధితో బాధపడుతున్నట్లు అంచనా. దీర్ఘకాలిక పెల్విక్ నొప్పితో బాధపడే మహిళల్లో 30-70 శాతం వరకు ఈ వ్యాధి ఉండే అవకాశముంది. అయినప్పటికీ ఈ సమస్య చాలా సందర్భాల్లో గుర్తించబడదు. అలాగే నెలసరి సమయంలో తీవ్రమైన నొప్పి రావడానికి మరొక కారణం గర్భాశయంలో ఏర్పడే ఫైబ్రాయిడ్స్ (గడ్డలు). ఇవి క్యాన్సర్ కాని గడ్డలు అయినప్పటికీ 20-40 శాతం భారతీయ మహిళల్లో కనిపిస్తాయి. ముందుగా ఇవి పెద్ద వయస్సులో మాత్రమే కనిపిస్తాయని భావించేవారు. కానీ ప్రస్తుత కాలంలో యువతుల్లో కూడా ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. జీవనశైలి మార్పులు, కాలుష్యం, ప్రాసెస్ చేసిన ఆహారం, ఒత్తిడి, స్థూలకాయం, ప్లాస్టిక్‌లో ఉండే హానికర రసాయనాలు వంటి అంశాలు హార్మోన్ అసమతుల్యతకు దారి తీస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఇవి శరీరంలో ఈస్ట్రోజెన్‌ను అనుకరించి వాపులను పెంచి, ఫైబ్రాయిడ్స్, ఎండోమెట్రియోసిస్ వంటి సమస్యలకు కారణమవుతున్నాయని వారు తెలియజేస్తున్నారు.

నెలసరి నొప్పుల కోసం ఎక్కువగా ఉపయోగించే ఐబుప్రొఫెన్ వంటి నాన్-స్టెరాయిడల్ యాంటీ ఇన్‌ఫ్లమేటరీ మందులు తాత్కాలిక ఉపశమనం ఇస్తాయి. కానీ దీర్ఘకాలం వాడితే జీర్ణాశయ సమస్యలు, అల్సర్లు, కిడ్నీ సమస్యలు, రక్తపోటు వంటి ప్రమాదాలు కలుగుతాయని, ముఖ్యంగా ఇవి అసలు సమస్యను దాచిపెట్టే ప్రమాదం కూడా ఉందని వైద్యులుహెచ్చరిస్తున్నారు. కనుక పీరియడ్ నొప్పులు తరచూ వస్తుంటే లేదా తీవ్రంగా మారితే ఆలస్యం చేయకుండా పరీక్షలు చేయించుకోవాలి. మొదట అల్ట్రాసౌండ్ లేదా సోనోగ్రఫీ ద్వారా పరీక్షించి, అవసరమైతే గైనకాలజిస్ట్‌ను సంప్రదించాలని సూచిస్తున్నారు. ప్రారంభ దశలో గుర్తిస్తే రక్తహీనత, గర్భాశయంలో గాయాలు, వంధ్యత్వం వంటి సమస్యలను నివారించవచ్చునని అన్ని వేళలా నెలసరి నొప్పిని తేలికగా తీసుకోకూడదని వైద్యులు సూచిస్తున్నారు.

# ఇరాన్ యుద్ధ చట్టాలను ఉల్లంఘించింది.. విచారణను ఎదుర్కోవాల్సి వస్తుంది: హ్యూమన్ రైట్స్ వాచ్



**ఇరాన్:** హర్మూజ్ జలసంధి, దాని పరిసర ప్రాంతాల్లో ప్రయాణించే నౌకలపై ఇరాన్ ఉద్దేశపూర్వకంగా దాడులు చేసిందని హ్యూమన్ రైట్స్ వాచ్ పేర్కొంది. తద్వారా ఇరాన్ యుద్ధ చట్టాలను ఉల్లంఘించిందని తెలిపింది. గత నెల 28న ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా యుద్ధం ప్రారంభమైంది. ఆ తర్వాత హర్మూజ్ జలసంధి, సమీపంలోని నౌకలు లక్ష్యంగా ఇరాన్ దళాలు దాడులు చేశాయి. ఈ దాడులు చేసింది తామేనని ఇరాన్ అధికారులు కూడా ప్రకటించిన విషయాన్ని హ్యూమన్ రైట్స్ వాచ్ గుర్తు చేసింది. వీటిని పౌర వాణిజ్య నౌకలుగా గుర్తించినట్లు వెల్లడించింది. యుద్ధంలో పౌరులు, వారి మౌలిక సదుపాయాలపై ప్రత్యక్ష దాడులు చేయడం అంతర్జాతీయ మానవతా హక్కుల ఉల్లంఘన కిందకే వస్తుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఉల్లంఘనలకు పాల్పడిన వారు విచారణను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. అమెరికాకు చెందిన సేఫ్‌సీ విష్ణు, థాయ్‌లాండ్‌లోని షిప్పింగ్ కంపెనీకి చెందిన మయూరి నారీ అనే రెండు వాణిజ్య నౌకలపై ఇరాన్ దళాలు మార్చి 11వ తేదీన దాడి చేసిన విషయం తెలిసిందే. దాడులకు పాల్పడింది తామేనని ఇరాన్ అధికారులు ప్రకటించారు. ఇందుకు సంబంధించి వీడియోలు, ఫొటోలను కూడా పోస్టు చేశారు. ఈ విషయాలను గుర్తు చేసిన హ్యూమన్ రైట్స్ వాచ్, ఇరాన్ యుద్ధ చట్టాలను ఉల్లంఘించిందని ఆరోపించింది. ఈ నెల 1 నుంచి 17వ తేదీ మధ్య కాలంలో హర్మూజ్ జలసంధి, పర్షియన్ గల్ఫ్, గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లలో మొత్తం 16సార్లు దాడులు జరిగినట్లు తెలిపింది. దీనితో మొత్తం 17 వాణిజ్య నౌకలకు నష్టం వాటిల్లినట్లు తెలిపింది. ఈ ఘటనల్లో మొత్తం ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోగా, పదిమంది గాయపడ్డారని, నలుగురు గల్లంతయ్యారని తెలిపింది. ఇరాన్ ఉద్దేశపూర్వకంగా ఈ దాడులు చేసిందని, కానీ ఇవి పౌర వాణిజ్య నౌకలుగా గుర్తించినట్లు తెలిపింది.

# అధ్వానంగా వరహా నది గ్రోయిన్లు!

## పాడైపోయిన రెగ్యులేటింగ్ గేట్లు



**ఎస్.రాయవరం, పతాకం న్యూస్:** మండలంలోని పలు గ్రామాల పరిధిలో వేలాది ఎకరాలకు సాగునీరు అందించే వరహా నది గ్రోయిన్లు అధ్వానంగా వున్నాయి. చాలా ఏళ్ల నుంచి మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో రాతిపేర్పులు ధ్వంసం అయ్యాయి. దీనివల్ల నదిలో నీటి ప్రవాహం వున్నప్పటికీ గ్రోయిన్ల నుంచి కాలువలకు నీరు సరిగా ప్రవహించని పరిస్థితి నెలకొంది. ఇక గ్రోయిన్ల నుంచి కాలువలకు నీరు ప్రవహించడానికి ఏర్పాటు చేసిన రెగ్యులేటింగ్ గేట్లు తుప్పు పట్టాయి.

అల్లూరి జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో పుట్టిన వరహా నది గొలుగొండ, నర్సీపట్నం, కోటవురట్ల మండలాల మీదుగా ప్రవహించి ఎస్.రాయవరం మండలంలో సముద్రంలో కలుస్తుంది. మండల పరిధిలో వరహానదిపై రిజర్వాయర్ నిర్మించే వెసులుబాటు లేకపోవడంతో రైతుల సాగునీటి అవసరాల కోసం పెదగుమ్ములూరు, సోముదేవుపల్లి, పెనుగొల్లు, సర్వసిద్ధి, లింగరాజుపాలెం, కొరుప్రోలు గ్రామాల వద్ద ఆరు గ్రోయిన్లు నిర్మించారు. పెదగుమ్ములూరు గ్రోయిన్ కింద 2,067 ఎకరాలు, కొరుప్రోలు గ్రోయిన్ కింద 1063 ఎకరాలు, సర్వసిద్ధి గ్రోయిన్ కింద 351 ఎకరాలు, లింగరాజుపాలెం గ్రోయిన్ కింద 375 ఎకరాలు, పెనుగొల్లు గ్రోయిన్ కింద 1095 ఎకరాలు, సోముదేవుపల్లి (మూలపాలెం) గ్రోయిన్ కింద 840 ఎకరాల ఆయకట్టు వుంది. వీటిలో పెనుగొల్లు, పెదగుమ్ములూరు, సోముదేవుపల్లి గ్రోయిన్‌లు చాలా కాలం క్రితమే పూర్తిగా దెబ్బతిన్నాయి. కొరుప్రోలు గ్రోయిన్ పెద్దమదుం పాడైంది. లింగరాజుపాలెం, సర్వసిద్ధి గ్రోయిన్‌లు సైతం మరమ్మతులకు గురయ్యాయి. దీంతో వందలాది ఎకరాలకు నీరు సక్రమంగా అందక ఏటా ఖరీఫ్ సీజన్‌లో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిసార్లు దెబ్బతిన్న గ్రోయిన్ల వద్ద రైతులు శ్రమదానంతో ఇసుక బస్తాలను అడ్డుగా వేసి, కాలువలకు నీటిని మళ్లించుకుంటున్నారు. భారీ వర్షాలు కురిసి, నదిలో వరద ఉధృతి పెరిగితే.. ఇసుక బస్తాలు కొట్టుకుపోయి సమస్య మళ్లీ మొదటికొస్తున్నది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఒక పెనుగొల్లు గ్రోయిన్ పునర్నిర్మాణానికి మాత్రమే నిధులు మంజూరు చేసింది. కాగా సోముదేవుపల్లి వద్ద కోతకు గురైన వరహా నది గట్టు వద్ద రక్షణ గోడ నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరు చేయగా, ఇందులో భాగంగా వున్న అక్కడే ఉన్న గ్రోయిన్‌కు కూడా మరమ్మతులు చేస్తారు. కాగా ఈ పనులు ఇంకా ప్రారంభం కాలేదు. మిగిలిన గ్రోయిన్ల మరమ్మతులకు నిధులు మంంజూరవ్వలేదు.




# షెడ్యూల్ ప్రకారమే 'ఐపీఎల్'



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 మరో నాలుగు రోజుల్లో ప్రారంభం కానుంది. అయితే పలువురు విదేశీ క్రికెటర్లు ఇంకా తమ జట్లతో చేరలేదు. కొంతమంది గాయాలపాలవ్వడం, మరికొందరు వర్క్‌లోడ్ కారణంగా కొన్ని మ్యాచ్‌లకు దూరమవుతారనే వార్తలు వస్తున్నాయి. దీనిపై క్రికెట్ మాజీలు కూడా తీవ్ర అసహనం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సోషల్ మీడియాలో ఓ వార్త హల్‌చల్ అవుతోంది. విదేశీ క్రికెటర్లు జట్లతో చేరాల్సి ఉండటంతో ఐపీఎల్‌ను వాయిదా వేస్తారనే ప్రచారం జరుగుతోంది. ఈ విషయంపై ఐపీఎల్ వర్గాలు స్పందించాయి. పలు రాష్ట్రాల్లో ఎన్నికల దృష్ట్యా ప్రస్తుతం 20 మ్యాచ్‌ల షెడ్యూల్‌ను మాత్రమే ఐపీఎల్ నిర్వాహకులు విడుదల చేసిన సంగతి తెలిసిందే. అయితే విదేశీ క్రికెటర్ల కోసం లీగ్‌ను ఆపలేమని ఐపీఎల్ వర్గాలు స్పష్టం చేశాయి. ప్రణాళిక ప్రకారమే మార్చి 28న టోర్నీ ప్రారంభం అవుతుందని.. సీజన్ మొత్తం జరుగుతుందని వెల్లడించాయి. విదేశీ ఆటగాళ్ల విషయం ఫ్రాంచైజీలే చూసుకుంటాయని ఐపీఎల్ వర్గాలు పేర్కొంటున్నాయి.

'మెగా లీగ్‌లో విదేశీ క్రికెటర్లు ఆడే విషయంలో ఫ్రాంచైజీలదే తుది నిర్ణయం. ఇందులో మేం చేసేదేమీ లేదు. కొందరు గాయాల కారణంగా ఇంకా తమ జట్లతో చేరలేదు. మరికొందరు వర్క్‌లోడ్‌తో కొన్ని మ్యాచ్‌లకు అందుబాటులో ఉండరు. వారి లభ్యతను ఫ్రాంచైజీలే చూసుకుంటాయి. ఐపీఎల్ మాత్రం షెడ్యూల్ ప్రకారమే జరుగుతుంది. పూర్తిస్థాయిలో అభిమానులు హాజరై ఆస్వాదించేలా చర్యలు తీసుకున్నాం' అని ఐపీఎల్ వర్గాలు తెలిపాయి. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌కు సంబంధించి బీసీసీఐ కీలక మార్పులు చేసింది. టోర్నీలో పాల్గొనే జట్ల కోసం శిక్షణ, మ్యాచ్ రోజుల ప్రవర్తనపై సరికొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ మేరకు అన్ని జట్ల మేనేజర్లకు సమాచారం అందించింది. పిచ్‌లను కాపాడటంతో పాటు షెడ్యూలింగ్‌ను క్రమబద్ధీకరించే లక్ష్యంతో మ్యాచ్ జరిగే రోజున జట్లు ప్రాక్టీస్ సెషన్లు నిర్వహించడాన్ని పూర్తిగా నిషేధించింది.

ముంబైలోని వాంఖడే స్టేడియం వంటి వేదికల కోసం ప్రత్యేక ఏర్పాట్లను కూడా బోర్డు వివరించింది. ఇక్కడ ప్రాక్టీస్ కోసం ప్రతి జట్టుకు రెండు నెట్స్‌తో పాటు, రేంజ్ హిట్టింగ్ కోసం మెయిన్ స్క్వేర్‌పై ఒక సైడ్ వికెట్‌ను కేటాయించనున్నారు. ఒకవేళ రెండు జట్లు ఒకేసారి ప్రాక్టీస్ చేస్తే, చెరో రెండు వికెట్లు ఇస్తారు. అయితే, ప్రత్యర్థి జట్టుకు కేటాయించిన ప్రాక్టీస్ ఏరియా ఖాళీగా ఉన్నప్పటికీ, దాన్ని వినియోగించడంపై కచ్చితమైన నిషేధం విధించారు. అంతేకాకుండా ఓపెన్ నెట్స్ నిర్వహించడం లేదా ఒక జట్టు త్వరగా వెళ్లిపోతే వారి వికెట్లను వినియోగించుకోవడం వంటి వాటిని కూడా అనుమతించబోమని బోర్డు తెలిపింది. మ్యాచ్ రోజున మెయిన్ స్క్వేర్‌పై ఎలాంటి ఫిట్‌నెస్ డ్రిల్స్ చేయకూడదన్న పాత నిబంధనను ఈసారి కూడా కొనసాగించనున్నారు. గతంలో అంతర్జాతీయ పర్యటనలకు వర్తింపజేసిన నిబంధనల తరహాలోనే, ఈసారి ఐపీఎల్‌లో కూడా ఆటగాళ్ల ప్రయాణాలపై ఆంక్షలు విధించారు. ఇందులో భాగంగా ఆటగాళ్లందరూ తప్పనిసరిగా టీమ్ బస్సులోనే స్టేడియానికి ప్రయాణించాలని ఆదేశాలు జారీ చేశారు. గతేడాది ఇదే సమయానికి, 45 రోజుల కంటే తక్కువ వ్యవధి ఉన్న అంతర్జాతీయ పర్యటనల సమయంలో ఆటగాళ్లు తమ కుటుంబాలతో కలవడాన్ని పరిమితం చేస్తూ బీసీసీఐ ఒక ఆదేశాన్ని జారీ చేసింది. ఈ ఐపీఎల్ సీజన్ నుంచి కూడా అలాంటి నిబంధనే అమలులోకి రానున్నట్లు తెలుస్తోంది.

# పేసర్లు కూల్‌గా ఉంటానంటే ఒప్పుకోను: శుభ్‌మన్ గిల్



ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందు టీమిండియా స్టార్ బ్యాటర్, గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ప్రత్యర్థి జట్లకు పరోక్ష హెచ్చరికలు జారీ చేశాడు. మంగళవారం అహ్మదాబాద్‌లో 'శుభారంభం 2026' పేరుతో గుజరాత్ టైటాన్స్ ఫ్రాంచైజీ నిర్వహించిన కార్యక్రమంలో గిల్ మాట్లాడాడు. హెడ్ కోచ్ ఆశిష్ నెహ్రా పక్కనే ఉన్న సమయంలో గిల్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. 'మన జట్టులో ఫాస్ట్ బౌలర్లు కూల్‌గా ఉంటా అంటే నేను ఒప్పుకోను. అలాంటి బౌలర్లు నాకు అవసరం లేదు కూడా. మన కోచ్ నెహ్రాలాగా ఫైర్‌తో ఉండాలి. ఫీల్డర్లు క్యాచ్‌లు వదిలేస్తే ఆయన ఎలా రియాక్ట్ అయ్యేవారో అందరికీ తెలుసు. గతంలో ఎంఎస్ ధోనీ కూడా నెహ్రా కోపానికి గురయ్యాడు. ఆ వీడియోలన్నీ సోషల్ మీడియాలో ఇప్పటికీ వైరల్ అవుతుంటాయి' అంటూ సరదాగా గిల్ వ్యాఖ్యానించాడు.

గుజరాత్ టైటాన్స్ జట్టు ప్లేయర్ల గురించి గిల్ మాట్లాడాడు. 'కగిసో రబాడా, సిరాజ్, ఇషాంత్ శర్మ, ప్రసిద్ధ్ కృష్ణ, హోల్డర్ వంటి బౌలర్లు మా టీమ్‌లోఉన్నారు. వాళ్లే మా జట్టుకు ప్రధాన బలం. గత సీజన్‌లో ప్రసిద్ధ్ 25 వికెట్లు తీసి పర్పుల్ క్యాప్ గెలిచాడు. అయినప్పటికీ గుజరాత్‌కు టైటిల్ రాలేదు. మేం మంచి క్రికెటే ఆడాం. ట్రోఫీ గెలవకపోయినా మా స్థాయికి తగ్గ ప్రదర్శన చేశాం. ఈసారి మా తప్పులను సరిచేసి మరింత బలంగా తిరిగొస్తాం' అని గిల్ వెల్లడించాడు. మరోవైపు కోచ్ నెహ్రా తనదైన శైలిలో స్పందిస్తూ 'ఆడేది వాళ్లే.. నేను బయట కూర్చుంటాను' అంటూ సరదాగా చెప్పడంతో హాల్‌లో నవ్వులు వెల్లువెత్తాయి. ఇక ఈ సీజన్‌లో గుజరాత్ తమ తొలి మ్యాచ్‌ను పంజాబ్ కింగ్స్‌తో మార్చి 31న న్యూ చండీగఢ్‌లో ఆడనుంది.





# రికార్డులను తుడిచిపెడుతున్న 'ధురంధర్ 2'



బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర ఆవిష్కృతమవుతోంది. యువ నటుడు రణవీర్ సింగ్ నటించిన స్పై థ్రిల్లర్ 'ధురంధర్ 2' వసూళ్ల సునామీ సృష్టిస్తోంది. ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం, రంజాన్ సెలవులను అందిపుచ్చుకుని కేవలం నాలుగు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 700 కోట్ల గ్రాస్ మార్కును అధిగమించి ట్రేడ్ వర్గాలను సైతం ఆశ్చర్యపరిచింది. ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన రావడంతో థియేటర్లు కిక్కిరిసిపోతున్నాయి. ముఖ్యంగా రణవీర్ సింగ్ నటన, ఆదిత్య ధర్ మేకింగ్ సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయని విశ్లేషకులు చెబుతున్నారు. ఆర్. మాధవన్, సంజయ్ దత్, అర్జున్ రాంపాల్ వంటి భారీ తారాగణం కూడా సినిమా స్థాయిని పెంచింది. ఈ చిత్రం సృష్టిస్తున్న ప్రభంజనం ముందు పాత రికార్డులు కొట్టుకుపోతున్నాయి. 'గదర్-2', 'జైలర్', 'సలార్' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాల లైఫ్‌టైమ్ కలెక్షన్లను 'ధురంధర్' కేవలం నాలుగు రోజుల్లోనే దాటేయడం విశేషం. ఆదివారం ఒక్కరోజే భారత్‌లో రూ. 114 కోట్లు వసూలు చేయడం దీని జోరుకు నిదర్శనం. తాజా ట్రేడ్ నివేదికల ప్రకారం ఈ చిత్రం సోమవారం కూడా బాక్సాఫీస్ వద్ద తన పట్టు నిలుపుకుంది. సాక్‌నిల్క్ రిపోర్ట్ ప్రకారం పనిదినాల్లోనూ మంచి ఆక్యుపెన్సీతో నడుస్తుండటంతో, బుధవారానికల్లా రూ. 1000 కోట్ల క్లబ్‌లో చేరడం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటికే ఈ సినిమా రణవీర్ సింగ్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా రికార్డు సృష్టించింది. ఇదే ఊపు కొనసాగితే, భారతీయ సినిమా చరిత్రలో టాప్-5 చిత్రాల సరసన నిలవడం ఖాయమని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు.

# ఏప్రిల్ 30న 'పెద్ది' విడుదల!



రామ్‌చరణ్ కథానాయకుడిగా నటించిన సినిమా 'పెద్ది' ఏప్రిల్ 30వ తేదీనే విడుదల కానుంది. బుచ్చిబాబు సనా దర్శకత్వంలో తెరకెక్కిన సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. మొదట్లో ప్రకటించిన విధంగానైతే ఈనెల 27న విడుదల కావాల్సిన సినిమా ఏప్రిల్ 30కి వాయిదా పడింది. తాజాగా మళ్లీ వాయిదా పడుతుందనే ఊహాగానాలు సోషల్‌మీడియాలో వస్తుండటంతో చిత్ర యూనిట్ స్పందించింది. టీజర్ ఈనెల 27న రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా విడుదలవుతోందని క్లారిటీ ఇచ్చింది. సినిమా విడుదలపై ఎలాంటి అపోహలు నమ్మొద్దని కోరింది. 27న విడుదల చేసే టీజర్‌తో రిలీజ్ డేట్ ఏప్రిల్ 30న అని కన్ఫర్మేషన్ ఇస్తామని పేర్కొంది. ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదల చేసిన రెండు పాటలు బాగా ట్రెండింగ్‌లో ఉన్నాయి.






# మే 1న 'గాయపడ్డ సింహం' విడుదల!



'తరుణ్ భాస్కర్ ప్రధాన పాత్రలో కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వంలో 'గాయపడ్డ సింహం' సినిమా తెరకెక్కుతోంది. ఈ సినిమా విడుదల తేదీని వెల్లడించారు. మే 1న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు చిత్రబృందం పేర్కొంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి దిల్‌రాజు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ 'ఈ సినిమా కాన్సెప్ట్ చాలా బాగుంది. అందుకే ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని ఇందులో భాగమయ్యా. మే 1న ఈ సినిమా విడుదల చేయాలని నిర్ణయించా. కాకపోతే కండిషన్స్ అప్లై.. ఏపిల్ 30న 'పెద్ది' విడుదల ఉంది. అది రిలీజ్ అయితే ఈ సినిమా విడుదల తేదీ మార్చుకోవడానికి కూడా సిద్ధంగా ఉన్నా. అపుడు ఒక వారం వాయిదా వేసుకునే అవకాశాలు ఉన్నాయి' అని దిల్‌రాజు చెప్పారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయం వల్ల ఓ యువకుడి జీవితం ఎలా మారింది? ఎలాటి ఇబ్బందులు పడాల్సివచ్చింది? అన్న కథాంశంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగ జీవితాలను ప్రతిబింబించేలా ఈ సినిమా తెరకెక్కినట్లు తెలుస్తోంది. ఇందులో తరుణ్ భాస్కర్‌కు జోడీగా ఫరియా అబ్దుల్లా నటిస్తున్నారు.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**